# సినాదం

నిఖార్సైన జర్నలిజం

సంపుటి : 18 సంచిక : 130 పేజీలు : 12 వెల : 5/- శుక్రవారం 30 జనవరి 2026


# ఉత్సాహంగా అరకు ఫెస్ట్..

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అరకు: అల్లూరి జిల్లాలో ఆంధ్రా ఊటీ అరకులోయలో అరకు ఉత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ ఫెస్ట్‌ను మంత్రులు కందుల దుర్గేశ్, గుమ్మడి సంధ్యారాణి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రులు పరిశీలించారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




# 2008 కంటే దారుణ పరిస్థితులు

## ఏఐపై ఆర్థిక సర్వేలో హెచ్చరికలు

**సాంకేతిక రంగంలో కృత్రిమమేధ సంచలనాలు సృష్టిస్తోంది. దానిలో భారీ మార్పులు చోటు చేసుకుంటే.. 2008 ఆర్థిక సంక్షోభం కంటే దారుణమైన పరిస్థితులు ఎదురుకావొచ్చని ఆర్థికసర్వే పేర్కొంది. భారత ఐటీ ఆధారిత వైట్ కాలర్ ఉద్యోగాలకు ప్రత్యక్ష ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఎదుర్కొనే అవకాశాలు 10 శాతం నుంచి 20 శాతం మేరే ఉండొచ్చని.. ప్రభావం మాత్రం తీవ్ర స్థాయిలో ఉంటుందని వెల్లడించింది.**

"భారత్‌లో ఐటీరంగం వైట్‌కాలర్ ఉద్యోగాల్లో కీలకమైంది. ఏఐ ప్రవేశంతో ఈ రంగంపై తీవ్ర ప్రభావాలు ఉండొచ్చు. అయితే రాత్రికి రాత్రే ఈ ఉద్యోగాలు పోవు. కానీ ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని విభాగాల్లో ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది" అని సర్వే పేర్కొంది. విదేశీ సంస్థలకు భారత్ నుంచి తక్కువ వేతనంతో ఐటీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు అవే ప్రమాదంలో పడ్డాయి. ఆ పనులను ఏఐ వేగంగా, తక్కువ




ఖర్చుతో చేస్తుండటం దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు, ఉద్యోగాలను రక్షించుకునేలా మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఎకనామిక్ కౌన్సిల్ ఉండాలని సర్వే ప్రతిపాదించింది.

# అమ్మ పుట్టినరోజునాడు రెండు జిరాఫీలను దత్తత తీసుకున్నా..

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విశాఖపట్నం ():**
ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. తన తల్లి అంజనా దేవి జన్మదినం సందర్భంగా జూపార్క్‌లోని రెండు జిరాఫీలను ఏడాదిపాటు దత్తత తీసుకుంటున్నట్లు పవన్ ప్రకటించారు. రెండు జిరాఫీలకు ఏడాదిపాటు అయ్యే ఖర్చు మొత్తం భరించనున్నట్లు తెలిపారు. జంతు సంరక్షణకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జూ పార్కులో నూతనంగా నిర్మించిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను పవన్ ప్రారంభించారు. జూపార్కులోని నీటి ఏనుగులు, నల్ల ఎలుగు బంట్లు, పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వాటికి ఆహారం అందించారు. వాటి పేర్లను జూ క్యురేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏనుగులు, జిరాఫీల శాలలను పరిశీలించారు. కంబాలకొండ ఎకో పార్కులో నగరవనాన్ని ప్రారంభించారు. ఎకో పార్కులోని చెక్క వంతెనపై వాక్ చేశారు. అక్కడ పెరుగుతున్న మొక్కల వివరాలను అధికారులను అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.



# చిన్నారులను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాల్సిందే

- తరచూ ఫేక్ పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు
- మంత్రి లోకేశ్ నేతృత్వంలో మంత్రుల బృందం సమావేశం

**అమరావతి:**
నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సామాజిక మాధ్యమ జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై మంత్రి లోకేశ్ అధ్యక్షతన సచివాలయంలో బుధవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హోం మంత్రి అనిత, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ... చిన్నారులకు సంబంధించి సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేసియా, ఫ్రాన్స్‌లలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ... మలేసియాలో మై డిజిటల్ ఐడీ, పాస్‌పోర్ట్ వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని తెలిపారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాలని మంత్రుల బృందం అధికారులకు సూచించింది.

### కులం, మతం, ప్రాంతం అంటూ విద్వేషం చిమ్మితే కఠిన చర్యలు

సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వార్తలు పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హ్యాబిచ్యువల్ అఫెండర్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్-46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి ఎడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఏపీపై రుణభారం రూ.4.33 లక్షల కోట్లు

**రిజర్వ్ బ్యాంక్ వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా వెలువరించిన నివేదిక ఈ అంశాన్ని విశ్లేషించింది. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సెక్యూరిటీల వేలంలో తీసుకున్న రుణాలు తీరాలంటే 2064వ సంవత్సరం రావాల్సిందే అంటున్నారు సంబంధిత నిపుణులు. అంటే, ఈ అప్పు తీరేందుకు మరో 38 ఏళ్లు పడుతుందన్నమాట. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతి రాష్ట్రానికి రుణాలు తీసుకునేందుకు అనుమతులిస్తుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను లెక్కించి, అందులో 3% వరకు రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇస్తూ ఉంటుంది.**

ఈ అనుమతులు రెండు విడతలుగా అంటే ముందు అర్ధ సంవత్సరానికి, తర్వాత రెండు త్రైమాసికాలకు వేర్వేరుగా లభిస్తాయి. ఇందుకు అనుగుణంగా ఆర్‌బీఐ సెక్యూరిటీల వేలం వేసి, ఆయా ప్రభుత్వాలకు రుణాలు సమకూరుస్తుంది. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ వివిధ ప్రభుత్వాలు సెక్యూరిటీల వేలం రూపంలో చేసిన అప్పులు, విభజన సమయంలో ఏపీకీ వాటాగా సంక్రమించాయి. ఆ తర్వాతి ప్రభుత్వాలు కూడా ఏటా రుణాలు తీసుకుంటూనే, మరోవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నాయి. ఇలా ఒక్క సెక్యూరిటీల రూపంలోనే ఏపీపై 2025 మార్చి 31 వరకు ఉన్న భారం రూ.4,33,443 కోట్లుగా ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ఈ అప్పు తీరాలంటే 2064 వరకు ఏటా కొంతమొత్తం చొప్పున చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొంది. ఈ ఐదేళ్లలోనే రూ.93,982 కోట్లు కట్టాలి!: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి రుణాలు తీర్చాలంటే రూ.93,982 కోట్లు అవసరం. ఈ ఒక్క అప్పు తీర్చాలంటేనే రాష్ట్ర బడ్జెట్‌పై ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు రూ.20,050 కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది రూ.18,109 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2028-29, 2029-30 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఏటా రూ.20 వేల కోట్లకు మించి కేటాయించాల్సి ఉంటుంది. మొత్తం అప్పులో ఏడాది లోపు తీర్చగలిగేది 4.6%, ఐదేళ్ల లోపు కట్టగలిగేది 17.1%, 5-10 ఏళ్ల గడువులో చెల్లించేది 27%. 10-20 ఏళ్ల వ్యవధిలో తీర్చాల్సిన అప్పు 47.8 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ విశ్లేషించింది.

సినాదం
నిఖార్సైన జర్నలిజం

# రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉంటాం

## 11 డిమాండ్ల సాధనకు ప్రభుత్వం ద్వారా కృషి



విశాఖపట్నం ():

రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేయడంతో పాటు తమ పరిధి మేరకు అండగా ఉంటామని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి( ఎన్ ఎ జె).. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండో రోజు గురువారం కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో అత్యంత ఉత్సాహంగా సాగింది.. ఈ సందర్భంగా వీరు పలువురు జర్నలిస్టులకు నూతన సభ్యత్వకార్డులు.. అలాగే రెన్యూవల్ కార్డులు.. వాహనాలకు సంబంధించి యూనియన్ పేరుతో ఉన్న స్టిక్కర్స్ అందజేశారు.. ఈ సందర్భంగా పాత్రికేయులతో వీరు మాట్లాడుతూ గత ఏడాది 600 మంది తమ యూనియన్ లో సభ్యత్వ నమోదు చేయించుకున్నట్లు చెప్పారు.. అనకాపల్లి .. అల్లూరి జిల్లాల్లో కూడా త్వరలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుం దన్నారు.. జర్నలిస్టులకు సంబంధించిన ప్రధానమైన 11 డిమాండ్ల సాధనకు తమ రాష్ట్ర కార్యవర్గం ద్వారా కృషి చేస్తున్నా మన్నారు.. అర్హులైన జర్నలిస్టులు అందరికీ త్వరలోనే అక్రిడేషన్లు అందనున్నాయని.. అలాగే.. ఇళ్ల స్థలాలు పెన్షన్ వంటి సదుపాయాల కోసం కూడా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని డిమాండ్లు సాధించుకోవడం జరిగిందన్నారు... వారం రోజులు పాటు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.. కావున వర్కింగ్ జర్నలిస్టులు అందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేసుకోవాలని అలాగే పాత సభ్యులు రెన్యువల్ కార్యక్రమాన్ని ముగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు పి నారాయణ్, విశాఖ జిల్లాకార్యదర్శి జి. శ్రీనివాస రావు, ఏపీబీజేఏ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొబ్బర ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, వై రవి కుమార్, రాజేష్, ప్రసాద్, కన్నబాబు, ఆశాలత, రమేష్ తదితరులతోపాటు పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు

# 30 నుంచి శ్రీనివాస సంగీత కళ్యాణోత్సవాలు

విశాఖపట్నం (పబ్లిక్ ప్రతినిధి):



సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ వ్యవస్థాపకులు వి ప్రభాకర్ , శ్రీనివాస కళ్యాణోత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఈనెల 30 31వ తేదీల్లో పెద్దవాల్తేరు శ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో గల కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీనివాస సంగీత కళ్యాణోత్సవానికి సంబంధించిన గోడ పత్రికను సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సులర్ ఆచార్య జిఎస్ఎన్ రాజు ఇసుకతోట జేఆర్ నగర్ వద్ద గల వారి స్వగృహంలో ఆవిష్కరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి దయతో శ్రీనివాస కళ్యాణోత్సవం జయప్రదంగా జరగాలని అన్నారు . ఈ సందర్భంగా సంస్థ అధినేత వి ప్రభాకర్ మాట్లాడుతూ 30వ తేదీ శుక్రవారం రోజున శృతిలయ వారిచే అన్నమాచార్య సంకీర్తన, గాత్ర సంగీత కచేరీలు , కోలాటములు అలాగే 31వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు స్వామివారి తిరువీధి మహోత్సవం సాయంత్రం 6 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఆచార్య చందు సుబ్బారావు కన్నుమూత

## సుబ్బారావు" మృతికి అరసం సంతాపం



**మార్క్సిస్టు రచయిత, అభ్యుదయ రచయితల సంఘంలో ప్రముఖుడు, ఆచార్య చందు సుబ్బారావు కన్నుమూశారు. ఈ వార్త దిగ్భ్రాంతి కలిగించిందని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, వల్లూరు శివప్రసాద్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా, మార్క్సిస్టు రచయితగా, భూభౌతిక శాస్త్రవేత్తగా, అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలక సభ్యులుగా ఆయన స్త్రీవాద, రాజకీయ మరియు శాస్త్రీయ అంశాలపై అనేక వ్యాసాలు మరియు పుస్తకాలు రచించారని వారు అన్నారు.**

### వ్యక్తిగత మరియు వృత్తి జీవితం

ఆయన మే 18, 1946న ఆంధ్రప్రదేశ్‌లోని చదలవాడలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి సైన్స్ అండ్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. 1974లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా చేరి, ఆ తర్వాత రీడర్‌గా, 1993 నుండి హైడ్రాలజీ అండ్ వెల్-లాగింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి 1979-82 మధ్య కార్యదర్శిగా వ్యవహరించారు మరియు ఇండియా మెటెయరలాజికల్ సొసైటీలో సభ్యులుగా ఉన్నారు.

డాక్టర్ చందు సుబ్బారావు సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. "సైన్స్ అండ్ సివిలైజేషన్" (1997)

"కవికి విమర్శకుడు శత్రువు కాదు" (1997)

"శ్రీ శ్రీ కా ఆధునిక్ తెలుగు సాహిత్య పర్ ప్రభావ్" (హిందీలో) "ఇండియన్ నవలికలు" వంటి అనేక రచనలు చేశారు. ఇటీవలే నాలుగు విమర్శా గ్రంథాలను ఒకే పుస్తకంగా వెలువరించారు.

1966లో తాపీ ధర్మారావు అవార్డు అందుకున్నారు.


1999లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లా శాఖ నుండి కొండేపూడి సాహితీ సత్కారం పొందారు.

ఆయన జ్యోతిష్యాన్ని విశ్వవిద్యాలయాలలో ఒక కోర్సుగా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించి, హేతువాద దృక్పథాన్ని ప్రోత్సహించారు.

ఆచార్య చందు సుబ్బారావు మృతిపట్ల అరసం రాష్ట్ర నేతలు ఉప్పల అప్పలరాజు, ఏ ఎమ్ ఆర్ ఆనంద్, కొమ్మాలపాటి శరత్, జి ఎస్ చలం తదితరులు విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేసారు.

# భవిష్యత్తు అంతా డిజిటల్ మీడియాదే..

## ప్రొఫెసర్ బాబీ వర్ధన్




ఇప్పుడు ప్రపంచమంతా డిజిటల్ మీడియా చుట్టూ తిరుగుతోందని ప్రపంచ భవిష్యత్తు డిజిటల్ మీడియాపై ఆధారపడి ఉందని ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజ విభాగం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ బాబి వర్ధన్ అన్నారు. విశాఖలో బుధవారం మధ్యాహ్నం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడాతూ సుదీర్ఘకాలం జర్నలిస్టులుగా ఉత్తరాంధ్ర జర్నలిస్టులు పనిచేశారని అందులో మానకొండ చలపతిరావు ఒకరని గుర్తు చేశారు. హెరాల్డ్ పత్రిక ఎడిటర్ గా నిజాయితీగా పనిచేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. విశాఖ స్థానికత అంటే ఈ ప్రాంతానికి మేలు చేసిన వ్యక్తులే స్థానికులు అని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత శ్రమ పడాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం విశాఖ నగర అభివృద్ధే ఉత్తరాంధ్ర అభివృద్ధి అని చెప్పడం సరికాదని పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎంఆర్ఎన్ వర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర స్థితిగతులపై జర్నలిస్టుల అధ్యయనం మరింత అవసరమని పేర్కొన్నారు. యూజెఎఫ్ తరఫున ఉత్తరాంధ్ర అంతటా పర్యటించి సమస్యలను ప్రగతిని విశిష్టతను బయట ప్రపంచానికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశామన్నారు. ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే రాము మాట్లాడుతూ అక్రిడిటేషన్ ప్రామాణికంగా జర్నలిస్టులను గుర్తించడం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలతో అవసరమైతే పోరాటానికి కూడా జర్నలిస్ట్ సంఘాలు సిద్ధంగా ఉన్నాయని గుర్తు చేశారు అర్హులైన ప్రతీవ్యక్తికి అక్రిడిడేషన్ అందేలా ఏపీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులవలస రామచంద్రరావు మాట్లాడుతూ జర్నలిస్టుల నీతి నిజాయితీల వల్లే ఇప్పుడు సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. అయితే దురదృష్టవశాత్తు కొందరు జర్నలిస్టులపై అవినీతి ముద్ర వేసి దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానిక మీడియా ద్వారానే ఉత్తరాంధ్రకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే చంద్రమోహన్, కౌన్సిల్ సభ్యులు డి హరినాథ్, వాసు, ఏపీయూడబ్ల్యూజే గాజువాక అధ్యక్షులు కోయిలాడ పరశు రాం, నారాయణరావు సీనియర్ జర్నలిస్ట్ జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సర్వేకు కొత్త రూపునివ్వాలి!

**మన దేశం స్వాతంత్ర్యం సంపాదించు కున్న కొత్తలో ముఖ్యమైన విధానపరమైన డాక్యుమెంట్లు ఏవైనా ఉన్నాయీ అంటే అవి ప్రణాళికా సంఘం ప్రచురించిన పంచవర్ష ప్రణాళికలే! ప్రణాళికా సంఘం ప్రాధాన్యం కోల్పోయి, ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రాభవం పెరిగిన తర్వాత, బడ్జెట్‌కు ముందు ఆర్థిక శాఖ సమర్పించే ఆర్థిక సర్వే క్రమేపీ ఎక్కువ మందిని ఆకర్షించడం మొదలైంది. ఈ సర్వే కొన్నేళ్ళుగా పెక్కు ఉపయోగకరమైన విధానపరమైన ఐడియాలను, ఆలోచనలను రేకెత్తించే అంశాలను మన ముందు ఉంచుతూ వస్తోంది.**




ఉదాహరణకు, చైనాపై వాణిజ్య, పెట్టుబడులపరమైన ఆంక్షలను విధించడంలోని ఔచిత్యాన్ని 2023--24 ఆర్థిక సర్వే ప్రశ్నించింది. అప్పటికి భారత్--చైనా సంబంధాలు కదలని స్థితిలోనే ఉన్నాయి. చైనా నుంచి వస్తువులను దిగుమతి చేసుకునే బదులు భారత దేశంలో వస్తూత్పత్తి చేసేందుకు చైనా సంస్థలకు అనుమతించడం మెరుగైన ఆలోచన అనిపించుకోవచ్చని సర్వే వాదించింది. వాణిజ్య మంత్రిత్వ శాఖ మొదట్లో ఆ ఆలోచనను తోసిపుచ్చినా, అది పునః పరిశీలించదగ్గ ప్రతిపాదనేనని ఆ తర్వాత అంగీకరించింది. సంక్షేమ పథకాల ఫలాలు అందవలసిన వారికి అందడం లేదనీ, వాటిలో లొసుగులు ఉన్నాయనీ గతంలో ఆర్థిక సర్వేలు ఎత్తి చూపాయి. లబ్ధిదారులకు నేరుగా నగదు బదలీ చేయాల్సిన అవసరం ఉందని చెప్పాయి. ఈ ప్రతిపాదన 2009--10, 2010--11 సంవత్సరాల సర్వేలలో మొదట చోటుచేసుకుంది. దానిపై అప్పట్లో మొదట్లో పెద్ద దుమారమే రేగింది. కానీ, అప్పటి నుంచి రైతులు, మహిళలు, ఇతర ఉద్దేశిత లబ్ధిదారుల ఖాతాలలోకి నేరుగా నగదు బదలీ చేయడం సంప్రదాయసిద్ధమైన విధాన సాధనాలలో అంత ర్భాగంగా మారింది.

### మరింత ఉపయోగపడేలా...

ఆర్థిక సర్వే కొత్త ఆలోచనలను అందించి, ఎక్కడెక్కడ దిద్దు బాటు చర్యలు అవసరమో సూచించగలదు. కానీ, సర్వేలో పది సూచనలు ఉంటే, ఏదో ఒక దానిపై చర్చించి, అమలులోకి తెస్తు న్నారు. మిగిలిన తొమ్మిదింటిని గాలికి వదిలేస్తున్నారు. దానికి తగ్గట్లుగానే, సర్వేలో చూపే టేబుల్స్, ఛార్టులలో గాఢత లోపిస్తోంది. మరి పౌరులు, సంస్థలు, ఇన్వెస్టర్లు, ప్రజా సేవకులకు మరింత ఉప యోగకరమైనవిగా ఆర్థిక సర్వేలు ఉండేటట్లు చేయడం ఎలా

మొదట... వాటిని ప్రాధాన్యం కలిగినవిగా మార్చాలి. తదుపరి ఆర్థిక సంవత్సరంలో ప్రపంచంలో రూపుదిద్దుకోగలిగిన వివిధ సందర్భాలను సర్వే స్థూలంగా వివరించగలగాలి. ఆ యా సందర్భా లలో వివిధ మంత్రిత్వ శాఖలు, రెగ్యులేటరీ ఏజన్సీలు విధాన పరంగా ఏ రకంగా స్పందిస్తే బాగుంటుందో కూడా సూచించాలి. అటువంటి పరిణామాల విశ్లేషణ చిన్న వ్యాపార సంస్థలు రానున్న నెలలకు సంబంధించి అత్యవసర ప్రణాళికలు తయారు చేసుకునేందుకు సహాయపడుతుంది.

బాహ్య వాతావరణం మార గానే, దానికి తగ్గట్లుగా విధానపరంగా చకచకా మార్పులతో స్పందించేందుకు ప్రభుత్వానికి వీలుంటుంది. రకరకాల ప్రత్యామ్నా యాలను లెక్కలోకి తీసుకుంటూ స్వల్ప, మధ్యకాలిక అంచనాలకు రావడంలో నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్‌తో కలసి ఆర్థిక మంత్రిత్వ శాఖ పనిచేయవచ్చు. ఈ అంచనాలను బట్టి ఎటువంటి పరిస్థితులు తలెత్తగలవో ప్రణాళిక వేసుకోవచ్చు. ఆర్థిక మంత్రిత్వ శాఖ వెబ్ సైట్‌లో ప్రతి 3 నెలలకోసారి ఈ అంచనాలను అప్డేట్ చేయవచ్చు.

### ఏం చేయాలి

ఒకటి -- చాలా భాగం భారతీయ వ్యాపార సంస్థలు సొంత ఆర్థిక, భౌగోళిక రాజకీయ సలహాదారులను నియమించుకోగలిగిన స్థోమత ఉన్నవి కావు. కీలక ఆర్థిక ప్రశ్నలపై మార్గదర్శనం చేయడం ద్వారా సర్వే బృందం ఆ లోటును భర్తీ చేయవచ్చు. రెండు -- సర్వే చాట భారతంలా కాకుండా వీలైనంత సంక్షిప్తంగా ఉండాలి. అది భారతీయ ఆర్థిక వ్యవస్థపై ఇయర్ బుక్‌లా కాకుండా ముఖ్యమైన ఆర్థిక సవాళ్ళపై దృష్టి కేంద్రీకరించిన సంగ్రహ డాక్యుమెంట్‌గా ఉండాలి. అప్పుడే అది నిజంగా ఉపయోగ పడుతుంది. నిర్ణయాలు తీసుకునేవారిలో చాలా మందికి సుదీర్ఘ పాఠాలను చదివేంత తీరిక ఉండదు.

మూడు-- ఆర్థిక సర్వే అందరి భాగస్వామ్యంతో రూపొంది నదిగా ఉండటం సముచితం. వివిధ ఆర్థిక మంత్రిత్వ శాఖలు,రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సమస్య లపై సర్వే బృందం ఇన్‌పుట్స్ సేకరించాలి. ఆ యా అంశాలపై ఆలోచించదగ్గ విధాన ప్రతిపాదనలు చేసిన వారికి విధాన నోట్సును తయారు చేసేందుకు స్వల్పకాలిక గ్రాంటులు మంజూరు చేయవచ్చు. ఆ సమావేశాల్లో పాల్గొనేవారు అకడమిక్ పరిశోధకులు, పాలసీ ప్రాక్టీషనర్లు ఇద్దరి మాటలను వినేవారుగా ఉండాలి. ఎటొచ్చీ వయసు విషయంలో కొన్ని పరిమితులు పెట్టుకోవడం వాంఛ నీయం. విధాన నిర్ణయ ప్రక్రియలో యువత పాలుపంచుకోవడాన్ని ప్రోత్సహించినట్లు అవుతుంది. బహిరంగ పోటీ వల్ల తుది ఎంపిక లను సీరియస్‌గా తీసుకోగల అవకాశం ఉంటుంది.

### హ్యాకథాన్ అవసరం

ఎవరో తెలివైన కొద్దిమంది పురుషులు, మహిళలతో భారత దేశ ఆర్థిక వ్యవస్థ లాంటి సంక్లిష్టమైన ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం కష్టం. చాలామంది విధాన నిర్ణేతలు తాత్కాలిక ప్రాతి పదికపై బయటవారి సలహాలు తీసుకునేందుకు మొగ్గు చూపుతూంటారు. కానీ, దీనికి ఒక విధానపరమైన బృందం అవసరం. ఆబృందాన్ని నేటి కంప్యూటర్ పరిభాషలో హ్యాకథాన్ అందాం. విద్యా వేత్తలు, విధానపరమైన పరిశోధకుల నుంచి సమాచారాన్ని సేకరించి క్రోడీకరించే సంస్థాగత వేదికగా అది పని చేస్తుంది.

నూతన విధాన పరిష్కారాలను ప్రతిపాదించేవారు సంకుచిత ప్రయోజనాల నిమిత్తం ఆ పని చేయడం లేదనీ, వారు పోటీతో కూడిన ప్రక్రియ ద్వారా ఎంపికై వచ్చినవారనీ విధాన నిర్ణేతలకు తెలిస్తే, వారు ఆ పరిష్కారాలను సానుకూలంగా పరిశీలించే అవ కాశం ఎక్కువ. హ్యాకథాన్ సూచించిన కొన్ని పరిష్కారాలు నేడు పూర్తిగా ఆచరణ సాధ్యమైనవి కాకపోయినప్పటికీ, అవి రేపటికైనా ఉపయోగపడేవిగా ఉంటాయి. నేటి యువ హ్యాకథాన్ విజేత రేపటి సీనియర్ విధానపరమైన నిర్ణేతగా పరిణమించనూ వచ్చు.

# పులకించిన మినీ మేడారం జాతర

**-గద్దెకు చేరి న సమ్మక్క తల్లి**
**పులకించిన భక్తులు**



**మణుగూరు జనవరి 29 (నినాదం):** గిరిజనుల ఆరాధ్య దైవం కొంగుబంగారం సమ్మక్క సారక్క మినీ మేడారం జాతర అంగరంగ వైభవంగా కొనసాగింది. గురువారం గిరిజనుల భక్తులు వారి సాంప్రదాయాల ప్రకారం వేల్పుల డోలు వాయిద్యాలతో సందడి చేస్తూ గిరిజన పూజారులు సమ్మక్క తల్లిని గద్దెకు చేర్చారు. సమ్మక్క దివి నుంచి భూమికి చేరే సమయంలో భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకునేం దుకు వనదేవత రూపంలో వచ్చిన సమ్మక్క తల్లిని పూజించుకుని భక్తులు ధరించిపోయారు. వనదేవత రూపంలో తరలివచ్చే సమ్మక్క తల్లికి భక్తులు తాకిడి భారీగా ఉండటంతో, స్థానిక పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాంప్రదాయ బద్ధంగా సమ్మక్క తల్లి అమ్మ వారు వనదేవత రూపంలో రావడంతో భక్తులు తండోపతం డాలుగా తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు రాక సందర్భంగా ప్రధాన రహదారిపై భక్తులు సందడి ఎక్కువగా ఉండటం తో మణుగూరు కొత్తగూడెం భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఆటంకం కలిగింది. వాహనాలను భక్తులను అదుపు చేసే క్రమంలో స్థానిక సీఐ నాగబాబు ఆధ్వర్యంలో ఏడూ లా బయ్యారం సీఐవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీ సంఘటన జరగకుండా పోలీసులు భారీ భద్రత కూడిన బందోబస్తుచేశారు. పోలీసు రెవెన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జాతర ప్రక్రియ ప్రశాంతంగా నడిచింది. అమ్మ వారి తల్లికి భక్తులు నిలువెత్తు బంగారాన్ని సమర్పించు కోవడం ఆలయ ప్రాంగణంలో భక్తులు కిక్కిరిసిపోయారు. జాతరలో ఉచిత మంచినీటి సరఫరాను అన్నదాని కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు పాల్గొని నిర్వహించారు.

# 5 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రాయనపేట

**మౌలిక వసతులు లేక గిరిజనుల ఆర్తనాదాలు.**
**కరెంట్ లేదు రోడ్డు లేదు తాగునీరు లేదు**
**అయినా పాలకుల స్పందన శూన్యం**




**అశ్వాపురం, జనవరి 29 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం, కళ్యాణపురం గ్రామపంచాయతీ పరిధిలోని రాయనపేట మారుమూల గ్రామం నేటికీ అభివృద్ధికి నోచుకోకుండా గిరిజనుల కన్నీళ్లకు నిలయంగా మారింది. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి సుమారు 25 సంవత్సరాల క్రితం వలస వచ్చి స్థిరపడిన గిరిజన కుటుంబాలు ఈ గ్రామంలో నివసిస్తున్నాయి. గ్రామంలో ప్రస్తుతం దాదాపు 25 గిరిజన కుటుంబాలు ఉంటున్నప్పటికీ, వారికి కనీస మౌలిక సదుపాయాలు కూడా అందని దుస్థితి నెలకొంది. విద్యుత్ సౌకర్యం పూర్తిగా లేకపోవడం, రోడ్డు సదుపాయం లేక గ్రామం ఒంటరిగా మారడం ఇక్కడి ప్రజల జీవితాలను నరకప్రాయంగా మారింది. గ్రామంలో తాగునీటి కోసం ఒకే ఒక్క బోరు మాత్రమే ఉంది. అది కూడా సోలార్ ఆధారితంగా మాత్రమే పనిచేస్తోంది. ఎండాకాలం, వర్షాకాలం, శీతాకాలం అన్న తేడా లేకుండా నీటి కొరత తీవ్రంగా ఎదురవుతోంది. బోరు పనిచేయని సమయంలో గ్రామ ప్రజలు ఒక కిలోమీటర్ దూరం నడిచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం వస్తే గ్రామానికి వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలు నిలిచిపోతాయి. రహదారి రాళ్లు, రప్పలతో నిండి ఉండటంతో వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందని స్థితి నెలకొంది. విద్య విషయానికొస్తే, గ్రామంలో మినీ అంగన్వాడి వరకు మాత్రమే సౌకర్యం ఉంది. ఆ తర్వాత చదువుకోవాలంటే చిన్నారులు రెండు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించాల్సి వస్తోంది. ఆ దారిలో సరైన రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను కొన్ని సంవత్సరాల క్రిందటి నుంచి ఎన్నోసార్లు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ అధికారులకి, జిల్లా కలెక్టర్లకు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాల రూపంలో అందించినా ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మారినా, ప్రభుత్వాలు మారినా రాయనపేట గ్రామం పరిస్థితి మాత్రం మారలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎస్ టి ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు అయినప్పటికీ, ఇప్పటివరకు రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. నిధులు ఎక్కడ ఆగిపోయాయో, పనులు ఎందుకు మొదలు కాలేదో ఎవరికీ సమాధానం చెప్పే పరిస్థితి లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

## బట్టా పూర్ గ్రామ పంచాయతీని
# సందర్శించిన ఎంపీవో శివచరణ్



**ఆర్మూర్, జనవరి 29 ( నినాదం):** బాల్కొండ నియోజక వర్గం ఏర్గట్లమండలం లోని బట్టాపూర్ గ్రామ పంచాయతీ ను ఎరుగట్ల మండల ఎం.పీ.వో. శివచరణ్ గురువారం సందర్శించారు. గ్రామంలో సమస్యలపై అభివృద్ధి పరిచేందు కు, కావాల్సిన, నిధులు, పలు అభివృద్ధి పనుల గురుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పం చ్ ప్రవీణ్ యాదవ్, ఉపసర్పంచ్ మూడ్ దయానంద్ లు మాట్లాడుతూ, ఇటీవల జిల్లా పట్టణం నిజామాబాద్ లోని జిల్లా కలెక్టర్ లో జరిగే ప్రజావాణి కార్యక్రమం లో తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య నివా రణ కై 60 నుండి 80వేల లీటర్ల పెద్ద వాటర్ ట్యాంక్ మంజూరి గురించి, సిసి డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల ల్లోని హై టెన్షన్ విధ్యుత్ తీగల తొలగింపు తో పాటు, గ్రామంలో మహిళలకు, వృద్ధులకు నూతన పెన్షన్ లు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి తో పాటు పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరు గురించి వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. దీంతో జిల్లా ఉన్నత అధికారుల ఆదే శాల మేరకు ఎంపీవో గ్రామంలో పర్యటించి, అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకొని సేకరించారు, గ్రామ ప్రజలను సైతం అడిగి తెలుసుకున్నారని సర్పంచ్, ఉపసర్పంచ్ లు తెలిపారు.

# ఖమ్మం జిల్లాలో సజావుగా మున్సిపల్ నామినేషన్ల స్వీకరణ

**-కలెక్టర్ అనుదీప్**



**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29(నినాదం):** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నామి నేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసా గుతోందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారు లను ఆయన ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పా టు చేసిన ఏదులాపురం మున్సిపా లిటీ వార్డుల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. నామినేషన్ దాఖ లుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, హెల్ప్‌డెస్క్‌లలో అవసరమైన ఫారాలు అందు బాటులో ఉంచాలని సూచించారు. నామినేషన్లు ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమని పేర్కొన్న కలెక్టర్, నామినేషన్ పత్రాల్లోని ప్రతి అంశా న్ని నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. జిల్లాలోని ఏదులాపురం, వైరా, కల్లూరు, మధిర, సత్తుపల్లి మున్సిపా లిటీల లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలి పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కోసం తప్పనిసరి గా కొత్త బ్యాంకు ఖాతా తెరవాలని, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థికి అదే వార్డుకు చెందిన వ్యక్తి ప్రపోజర్‌గా ఉండాలని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ, పరి శీలన, అభ్యంతరాల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, తుది అభ్యర్థు ల జాబితా ప్రకటన తదితర అన్ని దశలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, గోడపత్రాలు, ప్రచార వాహనాలకు అనుమతుల కోసం సంబంధిత అధికారులను సంప్ర దించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితం గా అమలు చేస్తూ క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్ర సాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ముస్వర్ అలీ, ఎంపీ డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ ఉద్యోగుల ఫోరం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 29 (నినాదం) :** విద్యాశాఖ ఉద్యోగుల ఫోరం జిల్లా క్యాలెండర్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ లు ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్ లోని విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అశ్విన్ ల అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమన్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా ఉద్యోగ విధులు నిర్వహిస్తూ, మన హక్కుల పోరాటం కొరకు ఉద్యమిద్ధమని పిలుపునిచ్చారు. ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుస్సేని (ముజీబ్) అధ్యక్షతన త్వరలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించబోయే టీఎన్జీవో 80 వసంతాల కార్యక్రమానికి ప్రతి ప్రాథమిక సభ్యుడు ఉద్యమస్ఫూర్తితో విచ్చేసి హక్కుల సాధన కొరకై తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, అర్బన్ యూనిట్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, సునీల్, టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, సదరు శాఖ అధికారులు ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రజా పాలన కాదు కక్ష సాధింపు పాలన
**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి డిసెంబర్ 29 ( నినాదం ) :** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ కెసిఆర్‌కు నోటీసులు పంపించడం పై గురువారం నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్పందించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు మాయమా టలు చెప్పి మోసం చేసి గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ప్రజా పాలన పేరుతో కక్ష సాధింపు పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ తెచ్చుడో కేసీఆర్ సచ్చుడో అంటూ నినదించి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాధించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సీట్ నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో సిట్, నోటీసుల పాలన, డైవర్షన్ పాలన నడుస్తుందని పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ పై కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేస్తుందని అన్నారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ము లేక సీఎం రేవంత్ రెడ్డి వరుసగా నోటీసుల డ్రామా ఆడుతున్నారని ఎగ్దేవ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ పాలన వైఫల్యం వరుస స్కామ్ ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీట్ నోటీసుల డ్రామాకు తెర తీశారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన ఎన్ని కుట్రలు పన్నిన బిఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారని తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉంటుందని కేసులకు నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అక్రమ కేసుల విషయాలపై బిఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటుందని అన్నారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచక పాలనను తెలంగాణ సమాజమంతా నిశ్శబ్దంగా గమనిస్తుందని రేపు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలిటీల ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని అభిప్రాయపడ్డారు.

# ముండ్ల విజయకి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం, జనవరి 29(నినాదం):** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 53వ డివిజన్ ద్వారకా నగర్ ముండ్ల ప్రసాద్ సతీమణి ముండ్ల విజయ గురువారం గుండె పోటుతో మరణించారు. వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి విజయ ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య,ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ,మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ,నంబూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

**రీపోలింగ్ జరిగేలా అధికారులు అవకాశం కల్పిస్తే శాఖ పరమైన చర్యలు**
**నిర్ణీత గడువులో బీ.ఫారం అందించకుంటే స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణిస్తాం**
**ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అన్ని పార్టీల వారు సహకరించాలి**



**ఆర్మూర్, బాల్కొండ, జనవరి 29 ( నినాదం):** ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గం గల ఆర్మూర్ పట్టణంలో, భీంగల్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల కేంద్రాలను, నామినేషన్ల, నామ పత్రాల స్వీకరణ కేంద్రాలను గురువారం రోజున జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా విచ్చేసి ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. నామ పత్రాల స్వీకరణ నిబంధనలకు అనుకూలంగా పూర్తి చేశారా, వార్డు స్థానాలకు ఇప్పటివరకు ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, పలు వివరాలను ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ ఎన్నికల అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నామ పత్రాలు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో గలవి అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడమే కాకుండా, అట్టివాటిని స్వయంగా పరిశీలించారు. ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో జిల్లా కలెక్టర్ స్వయంగా పలు లోపాలను గుర్తించారు. లోపాలను గుర్తించిన కలెక్టర్ సంబంధిత మున్సిపల్ ఎన్నికల అధికారులపై ఇలాంటి లోపాలు తలెత్తకుండా సరిచేసుకొని జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇలాంటి సందేహాలు ఉంటే వాటిపై పై స్థాయి అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకొని, తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల్లో అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ హిత బోధ చేశారు. జిల్లాలో ఎక్కడైనా మున్సిపల్ ఎన్నికల్లో రీపోలింగ్ జరిగే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపైనే శాఖపరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. నామినేషన్ల పరిశీలన ( స్క్రూటీల) ప్రక్రియలో నిబంధనలను తూచ తప్పక పాటించాలని, జాగ్రత్తతో విధులు నిర్వర్తించాలన్నారు. చివరి రోజైన శుక్రవారం రోజున అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు ఉన్న నేపాధ్యంలో, నామినేషన్లు స్వీకరించే అధికారులు ఎలాంటి గందరగోళానికి గురికాకుండా, అప్రమత్తతో, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శలకు అనుకూలంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు, అభ్యర్థులు, ఆయా మున్సిపల్ పరిధిలోని ప్రజలు సజావుగా జరిగేలా అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, అన్ని పార్టీల వారు ఎన్నికల నియమావళిని తూచ తప్పకుండా పాటించాలన్నారు. వివిధ పార్టీల వారు అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేస్తున్నవారు, నిర్ణీత గడువు లోపు బీ.ఫారం సమర్పించాలని, లేనియెడల స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు చిత్తశుద్ధితో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్మూర్, భీమ్గల్ మున్సిపల్ కమిషనర్లు ఉమామహేశ్వర్, గోపు గంగాధర్, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించిన డివిజన్ అధికారి



**ఆర్మూర్, జనవరి 29-( నినాదం) :** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ గ్రామంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలను, మోర్తాడ్ ఎస్సీ బీసీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆర్మూర్ డివిజన్ నోడల్ అధికారి పి. విజయ్ కుమార్ సందర్శించి పరిశీలించారు. పాఠశాలల స్థితిగతులను, పాఠశాలల్లో గల పలు మౌలిక వసతులు, తరగతుల గదుల స్థితిపై, ఉపాధ్యాయుల విద్యా బోధన తీరుపై, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని డివిజన్ అధికారి పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలను, ఎఫ్ ఎల్ ఎన్, ఎఫ్ ఎల్ ఎస్, బేస్ లైన్ టెస్ట్ మిడ్లైన్ టెస్ట్ ఎఫ్ ఎ, ఎస్ ఏ, ప్రశ్న పత్రాలను ప్రశ్న పత్రాలను, రిజిస్టర్ రికార్డులను ఆయన పరిశీలించారు. డివిజన్ అధికారి వెంట ప్రధానోపాధ్యాయులు నరసింహ మూర్తి, రమణాచారి పరిశీలన బృందం సభ్యులు రాజు, ఉపా ధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో నారాయణ
# ఒలింపియాడ్ ప్రారంభం



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 29 (నినాదం) :** ఆర్మూర్ పట్టణంలో నారాయణ ఒలింపి యాడ్ బ్రాంచ్‌ను విద్యా సంస్థల డైరెక్టర్ రమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణ విద్య సంస్థల్లో ప్రతి విద్యార్థికి ఉన్నతమైన విద్యను బోధించడంతో పాటు విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో, ఉత్తమ ఫలితాలను రాబట్టడంలో నారాయణ విద్యా సంస్థలు ఎల్లప్పుడు మొదటి స్థానంలో ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జోన్ ఏజీఎం శివాజీతో పాటు జీఎం, డీజీఎం, ఎజీఎం, హెచ్ ఆర్, ఆర్ డి హెడ్స్, జెడ్ సీవో, ప్రిన్సిపాల్స్, డీన్స్, విఐపిలు పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సి పాల్ రజనీ కుమారి మాట్లాడుతూ ఆర్మూర్ చుట్టు ప్రక్కల ప్రతి గ్రామంలోని తల్లిదండ్రులకు, విద్యార్థులకు మంచి అవ కాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవా లని కోరారు. అనంతరం శివాజీ పటేల్ మాట్లాడుతూ ఆర్మూర్‌లో ఒలింపియాడ్ ప్రారంభించడం నిజామాబాద్ జిల్లాకే శుభపరిణామమని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో నిబంధనలు పాటించాలి



**ఆర్మూర్, జనవరి 29 ( నినాదం) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నగర పురపాలక, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని, ఎన్నికల నిబంధన మేరకు మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒకరు నియమ నిబంధనలు పాటించాలని భీంగల్ ఎస్సై, తిరుపతి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసేవరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల సంఘం ప్రకటించిన ఈ క్రింది నిబంధనలను తప్పనిసరిగా పాటించి ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖకు, మున్సిపల్ ఎన్నికల సంబంధించిన అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు ఎలాంటి రసీదు లేకుండా 50 వేలకు మించి నగదును తీసుకు వెళ్ళవద్దని, ఎవరైనా బేకార్ చేస్తే ఎలక్షన్ కమిషన్ వారు పట్టుకొని డబ్బులు సీట్ చేస్తారని భీంగల్ ఎస్సై, తిరుపతి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నగదు పంపిణీ చేయడం, సరఫరా చేయడం నిషేధించడం జరిగిందన్నారు. అనుమానపరంగా నగదును తరలిస్తే అట్టి డబ్బులు చేసుకుని చట్టప్రకారం చర్యలు చేపట్ట పడతాయి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, లిక్కర్ అక్రమ నిల్వలు, అక్రమ రవాణా, అక్రమ విక్రయాలు పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. మద్యం దుకాణాలు ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ గడువు మేరకు మూసివేయాలన్నారు. ఎన్నికల్లో నగదు, మద్యం, పలు ఇతర బహుమతులను ఓటర్లకు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేస్తే నేరంగా పరిగణించి శాఖ పరమైన చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల ప్రచారంలో అధికారుల అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు నిర్వహించవద్దని సూచించారు. కుల,మత వర్గాల మధ్య విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు లాంటి ప్రచారాలు నిషేధించబడ్డాయన్నారు. సోషల్ మీడియాలో అసత్య సమాచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ప్రవర్తన నీయమ వలిని ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖకు, ఎన్నికల అధికారులకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సహకరించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని భీమ్గల్ ఎస్సై, తిరుపతి కోరారు.

## మీడియా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్




**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29(నినాదం):** కలెక్టరేట్ మొదటి అంతస్తు ఎఫ్-3 లో గల జిల్లా పౌరసంబంధాల అధి కారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి గురువారం ప్రారంభిం చారు. పురపాలక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకట నలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా కేంద్రం ద్వారా నిఘా పెట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంబంధ సమాచారం మీడియా కు ఎప్పటికప్పుడు అం దించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ప్రింట్ మీడియాలో ప్రచార ఖర్చుపై నిఘా, ఎలక్ట్రానిక్ మీడియా లో ప్రచార అనుమతు లకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసంబంధాల అధికారి ఎం.ఏ. గౌస్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ కె. ప్రవల్లిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ




**ఖమ్మం, జనవరి 29(నినాదం ):** ఖమ్మం నగంలోని ప్రైవేట్ ఆస్పత్రులు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు తనిఖీ నిర్వహించారు. గురువారం ఖమ్మం వ ట్ట ణ ం లో ని ల్యాబ్5 డయాగ్నోస్టిక్ సెంటర్, శ్రీ రామ కిడ్నీ, వంధ్యత్వం, ల్యాపరోస్కోపీ హాస్పటల్ లతో పాటు మామిళ్లగూడెంలోని ప్రవీణ ఫెర్టిలిటీ సెంటర్ లను జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. డి. రామారావు సందర్శించి స్కానింగ్ మెషీన్లను, రికార్డులను పరిశీలించారు. ప్రైవేట్ వైద్య సంస్థలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, పి.సి. పి.ఎన్.డి.టి. చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ డా. ప్రవీణ, డా. శ్రీకళ తమ హాస్పటల్‌లలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు డీ.ఎం. హెచ్.ఓ. కు చూపించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డా. అరుణ, హెచ్.ఈ.ఈ.ఓ. రవికుమార్, డి.పీ.ఓ. దుర్గ తదితరులు డి.ఎం. హెచ్.ఓ.తో పాల్గొన్నారు.

# డీపీఓను కలిసిన సర్పంచ్, ఉపసర్పంచ్



**అశ్వాపురం, జనవరి 29 (నినాదం ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలానికి,చెందిన సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మరియు ఉపసర్పంచ్ తుళ్ళూరి ప్రకాశ్ రావు ఈ రోజు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)ను కలసి అశ్వాపురం గ్రామపంచాయతీకి అవసరమైన మౌలిక వసతులపై మెమోరాండం సమర్పించారు. అశ్వాపురం గ్రామ పంచాయతీ పెద్దదైన కారణంగా ప్రస్తుతం ఉన్న ఒకే ఒక్క ట్రాక్టర్‌తో ఇంటింటికి చెత్త సేకరణ సాధ్యం కావడం లేదనీ, అందువల్ల అదనపు ట్రాక్టర్, ట్రాలీతో పాటు 5 మంది అదనపు సిబ్బందిని నియమించాలని డీపీఓ దృష్టికి తీసుకువచ్చారు. గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గ సభ్యులు లేకపోవడంతో తడి చెత్త, పొడి చెత్త, ముళ్ల కంపలు, చెత్త దిబ్బల తొలగింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వివరించారు. అలాగే అశ్వాపురం మేజర్ పంచాయతీగా ఉండటంతో వారంతపు సంత ద్వారా సంవత్సరానికి సుమారు రూ.6 లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ, ప్రస్తుతం సంత ఎంఆర్వో కార్యాలయం రోడ్డుకు ఇరువైపులా నిర్వహించబడటం వల్ల వాహనదారులు, రైతులు, పశువులు, ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కావున వారంతపు సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు. ఇక గ్రామపంచాయతీ భవనం విషయానికొస్తే, 1970లో అప్పటి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి శ్రీ జలగం వెంగళరావు గారి హయాంలో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, ఎన్నిసార్లు మరమ్మత్తులు చేసినా స్లాబ్ పెచ్చులు పడుతున్నాయని వివరించారు. ప్రస్తుతం అశ్వాపురం గ్రామ జనాభా 20 వేల పైగా ఉన్న నేపథ్యంలో నూతన గ్రామపంచా యతీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని డీపీఓను కోరారు. ఈ సందర్భంగా ఆర్ & బి కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, వెటర్నరీ హాస్పిటల్, ఆయుర్వేదిక్ హాస్పిటల్ పరిధిలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలను డీపీఓకు చూపించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని డీపీఓ హామీ ఇచ్చినట్లు సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు.

## ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో బందోబస్తుపై పోలీస్ అధికారుల దృష్టి



**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29(నినాదం)** ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వెంకట గిరిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గురువారం అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాద్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల సందర్భంగా చేపట్టిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ నామి నేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎన్నిక ల విధుల పట్ల పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. నామినేషన్‌ప్రక్రియను సంబంధిత అధికా రులను అడిగి తెలుసుకున్న అడిషనల్ డీసీపీ, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయా లని సూచించారు.

# ఎవరి కోసం మళ్లీ పాదయాత్ర

**గతంలో అధికారం ఇస్తే ఏం చేశావు**
**రుషికొండను బోడిగుండు చేశావు**
**మద్య నిషేధం పేరుతో ఏరులై పారించావ్**
**వైఎస్ జగన్ పాదయాత్ర ప్రకటనపై మండిపడ్డ షర్మిల**




**విజయవాడ, జనవరి 29 (నినాదం):**
జగన్ పాదయాత్ర ఇపుడు ఎందుకు... అధికారం కోసమే కదా అని కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. అధికారం ఇస్తే.. జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ప్రకటనపై వైఎస్ షర్మిల స్పందించారు. వైఎస్సార్ జలయజ్ఞం పేరుతో చేపట్టిన ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్... ఆ తర్వాత వాటిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మాట్లాడారు. మద్యం మాఫీ అన్న వ్యక్తి... మద్యాన్ని ఏరులై పారించి, నకిలీ మద్యంతో రూ.కోట్లు గడించారని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. 'రిషికొండ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోడి గుండు అయ్యింది. జగన్‌కు అధికారం ఇస్తే.. ప్రజలకు ఏం చేశారు. ప్రజల్లో ఉన్నారా, కనీసం వారి నాయకులకు కూడా అపాయింట్‌మెంట్ ఇచ్చారా... సీఎంగా అసలు జనాల్లోకి ఆయన ఎపుడు వచ్చారు. ఎన్నికలకు ముందు సిద్ధం సభలతో హడావుడి చేశారు. ఇపుడు మళ్లీ అధికారంలోకి వస్తే జగన్ ఏం చేద్దామని అనుకుంటున్నారు. ఒక మనిషి నిజమైన నైజం తెలియాలంటే.. ఆయనకు అధికారం ఇచ్చి చూడండి అని అబ్రహం లింకన్ అన్నారు. అధికారంలో ఉన్న జగన్ పని తీరు మనమంతా చూశాం' అని వైఎస్ షర్మిల విమర్శించారు. జగన్‌కు అధికారం సూట్ కాలేదు.. ఆయన నైజం మారాలి.. ఆయనలో మార్పు రావాలని షర్మిల అన్నారు. 'జగన్‌లో స్వార్థం తగ్గి ప్రజలకు సేవ చేసే గుణం రావాలి. అప్పటి వరకు దేవుడు కరుణించడు.. ప్రజలు కూడా ఆదరించరు. 2027 జూలైలో జగన్ పాదయాత్ర చేస్తే.. ఇపుడు ఎందుకు ప్రకటన చేయడం. మేము ఇపుడు యాత్ర చేస్తున్నాం కాబట్టి ప్రకటించాం. జగన్ ఉపాధి హామీ పథకం కోసం, కూలీల కోసం యాత్ర ఎందుకు చేయడం లేదు. మంద్రేగా కోసం మేము కూలీలకు అండగా నిలిచాం. జగన్ పాదయాత్ర ఎందుకోసం, ఎవరి కోసం.. ప్రయోజనం ఏంటో చెప్పాలి' అని వైఎస్ షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు.



## జిల్లాలకు భారీగా నిధులు విడుదల

**నెల్లూరు, జనవరి 29 (నినాదం):**
జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిధులు విడుదల చేసింది. రూ.128 కోట్లు విడుదల చేసి వచ్చే నెల 20 నాటికి ఖర్చు చేయాలని ఆదేశించింది. గుంటూరు జిల్లాకు రూ.20.61 కోట్లు, నెల్లూరు జిల్లాకు రూ.8.60 కోట్లు, కృష్ణా జిల్లాకు రూ.6.21 కోట్లు చొప్పున ఎన్‌హెచ్ఎం బడ్జెట్‌లో చివరి విడత కింద (2025-26) నిధులు విడుదల చేసింది. మిగిలిన జిల్లాలకు గరిష్టంగా రూ.5.20 కోట్ల నుంచి రూ.2 కోట్ల చొప్పున నిధులు రిలీజ్ చేసింది.

**డెట్ రికవరీ ట్రిబ్యునల్-3 సమక్షమునకు చెన్నై వద్ద**
**O.A. No. 969 of 2025**
**మెస్సర్స్ ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, రిటైల్ అస్సెట్ సెంటర్, అశోక్ నగర్ బ్రాంచ్,** నెం. 44/86, 1వ అంతస్తు, 4వ అవెన్యూ, అశోక్ నగర్, చెన్నై 600083.
**బదిలీ చేసినది**
**ది మేనేజర్, రిటైల్ రికవరీ-వేలూర్,** నెం. 18, అవడి రోడ్, కరయన్ చావడి, పూనమల్లై, చెన్నై 600056
....దరఖాస్తుదారు
**కు మరియు**
**కుమారి ఎస్. ఎలిజబెల్ జాస్మిన్,** తండ్రి సదాశివం, నెం. 2/177, వెటైకరపాలయం, వెప్పంపట్టు, తిరువల్లూర్ 602024.
**మరియు**
**కుమారి ఎస్. ఎలిజబెల్ జాస్మిన్,** తండ్రి సదాశివం, నారాయణ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ హాస్టల్, చింతారెడ్డి పాలెం, నెల్లూరు, ఆంధ్రాప్రదేశ్ 524003.
...ప్రతివాది
**కు మధ్య**
ప్రత్యామ్నాయ సేవల ద్వారా ప్రతివాదికి సమన్లు
పైన తెలిపిన దరఖాస్తుదారు **01.10.2024** నాటికి రూ. **29,68,259/- (రూపాయలు ఇరవై తొమ్మిది లక్షల అరవై ఎనిమిది వేల రెండు వందల యాభై తొమ్మిది మాత్రమే)** + రుణం తీరే తేది వరకు సాలుకు వర్తించే వడ్డీతో వసూలు చేసుకొనుట కొరకు ఈ ట్రిబ్యునల్ సమక్షమునకు పైన రెఫర్ చేసిన దరఖాస్తును దాఖలు చేసినారు.
సదరు సమన్లు/నోటీసులు జారీ చేసినప్పటికీ సాధారణ పద్ధతిలో ప్రభావితం కానందున ప్రత్యామ్నాయ సేవల ద్వారా జారీ చేయవలసిందిగా ఈ ట్రిబ్యునల్ ఆదేశించినందున, పత్రికా ప్రచురణ ద్వారా ఈ నోటీజు జారీ చేయడమైనది.
కావున ఈ ట్రిబ్యునల్ సమక్షమునకు **05.06.2026**న ఉ. **11.00 గం॥లకు** వ్యక్తిగతముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కావలసిందిగా సూచిస్తూ మరియు మీకు ఎందుకు ఉపసమనం కలిగించవలెనో కారణం తెలుపవలసిందిగా కోరడమైనది. ఒక వేళ విఫలమైనచో చట్టమును అనుసరించి సదరు దరఖాస్తుపై వాదనలు విని మీ గైహాజరు సమయములో నిర్ణయము తీసుకోబడును.
**తేది 21 జనవరి, 2026న ఇది చెన్నై వద్ద జారీ చేయడమైనది**
**ఎస్. పార్థసారథి**
దరఖాస్తుదారు తరపున న్యాయవాది



## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఏపీ హైకోర్టు కీలక నిర్ణయం

**ముగ్గురికి బెయిల్ మంజూరు..మరో ఇద్దరికి రద్దు**

**అమరావతి, జనవరి 29 (నినాదం):**
ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. అయితే.. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డి, ముప్పిడి అవినాశ్ రెడ్డి బెయిల్ పిటిషన్లను మాత్రమం న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ వచ్చిన ముగ్గురికి కోర్టు పలు షరతులను విధించింది. ప్రధానంగా పాస్‌పోర్టులను మేజిస్ట్రేట్ కోర్టులో సమర్పించాలని, న్యాయమూర్తి అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని ఆదేశించింది. అదే విధంగా బ్యాంక అకౌంట్లకు సంబంధించి కూడా పలు కీలక ఆదేశాలు జారీ చేసింది హైకోర్టు. ఈ షరతులకు సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఇక ఈ కేసులో ఇప్పటికే ఐదుగురికి బెయిల్ మంజూరు అయిన విషయం తెలిసిందే. ఇందులో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓఎస్డీగా ఉన్న కృష్ణమోహన రెడ్డి, జగన్ సెక్రెటరీగా ఉన్న ధనుంజరు రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, రాజంపేట ఎంపీ అవినాశ్ రెడ్డి సహా మరొకరికి బెయిల్ వచ్చింది. తాజాగా మరో ముగ్గురికి కూడా బెయిల్ లభించింది. దీంతో ఈ కేసులో మొత్తం ఎనిమిది మందికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాదాపు వంద రోజుల తర్వాత సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు బెయిల్ ఇవ్వడంతో పాటు పలు షరతులను హైకోర్టు విధించింది.

## లడ్డూ కల్తీ పాపం జగన్ అండ్ కో.. దే

**కల్తీ నెయ్యి వాడారని సిట్ తేల్చింది**
**వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



**ఒంగోలు, జనవరి 29 (నినాదం):**
జగన్ హయాంలో తిరుపతి లడ్డూను కల్తీ చేశారని.. ఆ పాపం జగన్ అండ్‌కో దేనని ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. కోట్లాదిమంది భక్తులు ఆరాధించే తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారని సిట్ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. కెమికల్స్ ఉపయోగించి లడ్డూ తయారు చేశారని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.250 కోట్ల అవినీతి చేసిన వాళ్లని జైలుకు పంపితే దాన్ని రెడ్‌బుక రాజ్యాంగం అని ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాలో మంత్రి సత్యకుమార్ గురువారం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేసిన వాళ్లని వదిలేయండి, రప్పా రప్పా అన్న వాళ్లని వదిలేయండి, తలలు ఎగరేసి నరుకుతామనే వాళ్లని ఉపేక్షించాలనేలా జగన్ మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల వల్ల.. ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఓ వ్యక్తిగత విషయాన్ని వైసీపీ బూతద్దంలో చూపిస్తోందని మంత్రి సత్యకుమార్ దుయ్యబట్టారు. 'వ్యక్తిగత విషయాలను కూటమి ప్రభుత్వానికి రుద్దే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. జగన్ మాటలు చూసి ఆయన అవగాహన రాహిత్యంపై నవ్వొస్తోంది. సొంత బాబాయికు గొడ్డలి పోటు వేసి గుండెపోటుగా నమ్మించాలని జగన్ చూశారు. సొంత చెల్లెలి మీదే తండ్రిని చంపిన కేసు మోపేందుకు కుట్రపన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట తీసుకువచ్చి భూములు కొట్టేయాలని ప్రయత్నించారు. సొంత ఖజానా నింపుకోవడం కోసం నాణ్యత లేని మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీయడం జగన్‌కు పాపంగా అనిపించడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా బాధ్యతలు విస్మరించి అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారు' అని మంత్రి ధ్వజమెత్తారు. కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి మరణిస్తే.. ఆస్పత్రి మూసివేశామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. 'ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించినట్లుగా వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవముంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. వారానికి ఒకరోజు విజిటర్ పొలిటీషియన్‌లా జగన్ ఏపీకి వచ్చి పోతున్నారు. జగన్‌కు ఇప్పటికే ప్రజలు గుణపాఠం చెప్పారు. ఆత్మ విమర్శ చేసుకుని సరైన మార్గంలోకి రాకపోతే.. మీ రాజకీయ సమాధి మీరే కట్టుకున్నట్లే. ఏపీలో అమాయకులను మా ప్రభుత్వం అరెస్ట్ చేయలేదు. మద్యం కేసులో ఉన్నవాళ్లు, ప్రజల ప్రాణాలు తీసినవాళ్లు, పోలింగ్ బూతుల్లోకి వెళ్లి గొడ్డలితో దాడులు చేసిన వాళ్లే అరెస్టయ్యారు' అని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రోడ్డుపై నో పార్కింగ్ బోర్డులు: ట్రాఫిక్‌కు అంతరాయం

**నెల్లూరు, జనవరి 29 (నినాదం):**
నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అయ్యప్ప గుడి నుండి గాంధీ బొమ్మ వరకు వెళ్లే మెయిన్ రోడ్డులో ఎంజిబి బ్రదర్స్ మాల్ వారు సగం రోడ్డుపై 'నో పార్కింగ్' బోర్డులను ఏర్పాటు చేయడం వలన వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ బోర్డులను వైరుతో కట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని తొలగించి రోడ్డును సౌకర్యవంతంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ మరియు పోలీస్ సిబ్బందిని ప్రజలు కోరుతున్నారు.

## పర్యాటకంగా రాష్ట్రం అభివృద్ధి

**అనకాపల్లి ఉత్సవ్ ఏర్పాట్లు పరిశీలించిన అనిత**

**అనకాపల్లి, జనవరి 29 (నినాదం):**



రాష్ట్ర పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గురువారం అనకాపల్లి జిల్లాలో అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనకాపల్లి ఉత్సవ్ నేపథ్యంలో ముత్యాలమ్మపాలెం తీరంలో.. విద్యుత్ దీపాలు, బీచ్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, లైవ్ బ్యాండ్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఉన్నారు. అనకాపల్లి ఉత్సవ్‌ను ఈనెల 30, 31 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఏపీలో పర్యాటక శాఖ అభివృద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. గతంలోనూ విశాఖపట్నం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని ఆమె గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కళాకారులకు ఈ ఉత్సవాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోం మంత్రి తెలిపారు. ఈ మేరకు ముత్యాలమ్మపాలెం తీరంలో అనేక కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. కొండకర్లలోనూ వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు. అనకాపల్లిలో ఫ్లవర్ షో, క్రాకర్స్ షో, సంగీత విభావరి సహా కార్నివాల్‌నూ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గజ ఈతగాళ్లను కూడా తీరంలో సిద్ధంగా ఉంచుతున్నామన్నారు.

## రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ సజీవ దహనం

**కాకినాడ, జనవరి 29 (నినాదం):**



కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఓ లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. 16వ నంబర్ జాతీయ రహదారిపై లారీ యూటర్న్ తీసుకుంటుండగా.. అదే సమయంలో వేగంగా వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. దీంతో ఓ లారీలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఆ రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలార్పేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి బాధ్యుడైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా.. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక జామ్ అయింది. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫికనూ‌క్లియర్ చేశారు. ఇక సజీవ దహనమైన డ్రైవర్ స్వస్థలం కోల్‌కతా అని పోలీసులు వెల్లడించారు.

## తిరుపతి లడ్డూపై భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రచారం

**జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తేల్చింది**
**ఆరోపణలపై సుప్రీంను ఆశ్రయిస్తామన్న వైవి సుబ్బారెడ్డి**



**న్యూఢిల్లీ, జనవరి 29 (నినాదం):**
టీటీడీ దేవస్థానానికి సంబంధించి కల్తీ నెయ్యి అంశంపై సుప్రీంకోర్టు నియమించిన సిట్.. నెల్లూరు ఏసీబీ కోర్టులో ఛార్జ్‌షీట్ సమర్పించిందని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఫైనల్ చార్జ్‌షీట్‌లో నెయ్యిలో కల్తీ జరిగిందని, కానీ జంతు కొవ్వు లేదని సిట్ చెప్పిందనిప్రస్తావించారు. వైసీపీ హయాంలో స్వామివారికి సమర్పించే ప్రసాదంలో కూడా నెయ్యికి బదులు యానిమల్ ఫ్యాట్ వాడారని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉండే శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వచ్చిందని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. దేశంలో ఎంతోమంది భక్తులు ఆందోళనకు లోనయ్యారని చెపరకొచ్చారు. స్వామి వారి ప్రసాదంలో జంతువు కొవ్వు కలిపారని వస్తున్న వార్తలపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే సిట్ విచారణపై తమకు నమ్మకం లేదని.. సుప్రీం కోర్టులో స్వతంత్ర దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించాలని పిటిషన్ వేశానని ప్రస్తావించారు. 'విచారణ రిపోర్టు రాకుండానే రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు మాట్లాడటం సరికాదని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. తిరుపతి లడ్డూ విషయం ఎంతోమంది భక్తుల మనోభావాలకు సంబంధించింది. 2024 జూలైలో సప్లై చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందా లేదా అనే విషయం నిర్ధారణ చేయాలని సిట్ వేశారు. ఆ నెయ్యిని స్వామివారి ప్రసాదంలో వాడారో లేదో తేల్చాలని సిట్ వేశారు. నెయ్యిలో కల్తీ జరిగింది, కానీ జంతువు కొవ్వు కలవలేదని స్పష్టంగా సిట్ చెప్పింది. వైసీపీ హయాంలో జూలైలో నాలుగు ట్యాంకర్లు వస్తే వాటిలో కూడా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చి చెప్పారు. ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిని సైతం వేరే రూపంలో టీటీడీకి సప్లై చేసి లడ్డూ తయారీలో వాడారు. నాపై, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. మాపై చేసిన ఆరోపణలపై కోర్టును ఆశ్రయిస్తాం' అని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రాన్ని కలుషితం చేస్తున్న జగన్

**అప్పుడప్పుడు వచ్చి విషం చిమ్ముతున్నారు**
**జగన్‌పై ఎంపి అప్పలనాయుడు మండిపాటు**



**న్యూఢిల్లీ, జనవరి 29 (నినాదం):**
జగన్ బెంగళూరులో ఉంటూ.. అప్పుడప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి రాష్ట్ర సంబంధిత అంశాలను కలుషితం చేస్తున్నారనిటీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. కనీసం 19 నెలల్లో 10 రోజులైనా ఆంధ్రప్రదేశ్‌లో నివాసమున్నారా అని జగన్‌ను ప్రశ్నించారు. కనీసం ఈ రాష్ట్రం గురించి వైసీపీ అధినేతకు తెలుసా అని నిలదీశారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ మేరకు ఢిల్లీలో ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్ పాలనను ప్రజలు తిరస్కరించి బుద్ధి చెప్పారని అన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని ఎంపీ తెలిపారు. జగన్ పాలనలో చేసిన అప్పులను తీర్చేందుకు.. చంద్రబాబు అనుభవం, వ్యూహాలతో రాష్ట్రాన్ని గాడినపెట్టారని అప్పలనాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి జరగొద్దని, పారిశ్రామిక వేత్తలు రావొద్దని జగన్ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. పెట్టుబడుల కోసం దావోస్‌కు ఎక్కువసార్లు వెళ్లిన సీఎంలు ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు మాత్రమేనని.. పారిశ్రామిక అభివృద్ధి జరిగితే రాష్ట్ర పురోగతి సాధ్యమవుతుందని ఆయనకు తెలుసన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు చేసిన అభివృద్ధికి నాంది పలుకుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. జగన్ ముఠా సభ్యులు మాట్లాడుతున్న తీరుపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యి జరిగిందని ఆరోపణలు చేసి దొరికిపోయిన సందర్భాలు చూశామని, ఏదీ జరగలేదని వారు మీడియా, సోషల్ మీడియాల ద్వారా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కల్తీ నెయ్యి విషయంలో సిట్ ఆధారాలతో సహా నిరూపించిందన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని.. వారికి వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో తిరుమలను ఆదాయంగా మార్చి.. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీశారని ఆరోపించారు. జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు.దేశం, రాష్ట్ర అభివృద్ధిలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోందని అప్పలనాయుడు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు.. నాలుగు పిల్లర్లుగా రాష్ట్రాన్ని దేశంలో ఉన్నతస్థానానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. అమరావతిలో బ్రహ్మాండంగా, ప్రపంచ స్థాయిలో ఉండే విధంగా నిర్మాణం జరుగుతోందన్నారు. పోలవరం, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, రాయలసీమ అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారంటూ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హోంగార్డు ఆస్తులు 20 కోట్లు

**ఎసిబి దాడుల్లో బట్టబయలు**



**విజయనగరం, జనవరి 29 (నినాదం):**
ప్రభుత్వ ఉద్యోగులు అడ్డదారిలో అక్రమాస్తులు కూడబెట్టి అడ్డంగా దొరికిపోయిన ఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట చూస్తూనే ఉంటాం. అయితే కొన్నిసార్లు వాళ్లు చేస్తున్న ఉద్యోగానికి వెనకేసిన అక్రమ సంపాదనకు పొంతనే ఉండదు. అలాంటి షాకింగ్ ఘటనే ఏపీలో వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఓ హోంగార్డు భారీగా అక్రమాస్తులు కూడబెట్టి హాట్ టాపికగా మారాడు. విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. విజయనగరం, గుర్ల, విశాఖపట్నం ప్రాంతాల్లోని శ్రీనివాస రావు నివాసాల్లో తనిఖీలు చేసి, సుమారు రూ.20 కోట్లు అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా గుర్తించారు. శ్రీనివాసరావు ఏసీబీలో 15 ఏళ్లు పనిచేసి అధికారుల దాడుల గురించి ముందుగానే సమాచారమిచ్చి డబ్బులు తీసుకునేవాడని, అవినీతి ఆరోపణలు రావడంతో అతడిని పోలీస్ కార్యాలయానికి బదిలీ చేశారని ఏసీబీ అధికారులు వెల్లడించారు. హోంగార్డు శ్రీనివాసరావు ఇంటితోపాటు అతడి సన్నిహితులు, బంధువుల నివాసాల్లో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. సాధారణ హోంగార్డు ఉద్యోగం చేసే వ్యక్తి ఇంత భారీ మొత్తంలో ఆస్తులు సంపాదించడం ఇపుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇవాళ తెల్లవారుజాము నుంచే ఏసీబీ బృందాలు రికార్డులను పరిశీలిస్తున్నాయి.

## జగన్ హయాంలో ఫిష్ ఆంధ్ర పేరుతో దోపిడీ

**మత్స్యకారులను పూర్తిగా మోసం చేశారు**
**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**విజయవాడ, జనవరి 29 (నినాదం):**
జగన్ హయాంలో ఫిష్ ఆంధ్ర పేరుతో కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహించారు. జగన్ హయాంలో చాలా బకాయిలు పెట్టడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లల్లో మత్స్యకారులకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వారికి కేటాయించిన డబ్బులు ఇతర వాటికి ఉపయోగించారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో వల, తెప్ప ఏవీ ఇవ్వలేదని దుయ్యబట్టారు. చిరిగిన వలను కుట్టుకోవడానికి కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. విజయవాడలో గురువారం ఏపీ ఫిషరీస్ ఛైర్మన్, డైరెక్టర్‌ల ప్రమాణ స్వీకార సభ జరిగింది. ఏపీ ఆఫ్కాఫ్ ఛైర్మన్‌గా యాటగిరి రాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సభలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఇతర రాష్టాల్లో ఫిషరీస్ సొసైటీ వృద్ధి చెందిన తీరుపై అధ్యయనం చేస్తామని తెలిపారు. ఏపీలో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ ఇప్పిస్తామని చెప్పుకొచ్చారు. 2019కి ముందు చంద్రబాబు మత్స్యకారుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా సరిచేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పాత బకాయిలను కూడా ఈ ప్రభుత్వం చెల్లిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## గీతం ఆధీనంలో 54.79 ఎకరాల భూమి

**క్రమబద్ధీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆందోళన**
**అడ్డుకున్న గీతం భద్రతా సిబ్బంది**



**విశాఖపట్నం, జనవరి 29 (నినాదం):**
గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న 54.79 ఎకరాల భూమి క్రమబద్ధీకరణను వైసీపీ వ్యతిరేకిస్తోంది. గురువారం ఆ భూములను పరిశీలించేందుకు విశాఖపట్నంలోని వైసీపీ నేతల బృందం వెళ్లింది. ఈ బృందాన్ని మెయిన్ గేట్ వద్ద గీతం యూనివర్సిటీ భద్రతా సిబ్బంది అడ్డుకుంది. దీంతో ఆ బృందంలోని సభ్యులు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద నిరసన చేపట్టారు. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక పోలీసులు రంగంలోకి దిగి.. ఆ బృందాన్ని అక్కడ నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న 54.79 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కౌన్సిల్ తీర్మానాన్ని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను విశాఖపట్నంలోని వైసీపీ కార్పొరేటర్లతో పాటు స్థానికంగా ఆ పార్టీ నేతలు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందుకోసం ఈ భూములు పరిశీలించేందుకు సదరు బృందం గురువారం గీతం యూనివర్సిటీ వద్దకు చేరుకుంది. ఆ బృందం యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని.. ఆందోళనకు దిగిన వైసీపీ నేతలను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు.




# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం!

సంపాదకీయం

ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయా యులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవు లను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలి టీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవ సరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిష నర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడ తారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గు చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదల య్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్టణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకు నేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుం డటంపై బిఆరఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలను కొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుం దనే బాధ కూడా అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా పట్టణాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.

# అరణ్య గర్భాన అస్తిత్వ సమరం.!

### ప్రపంచ ఆధ్యాత్మిక పటంలో ఆసియా ఖండపు మహా అద్భుతం మేడారం!



భారతీయ సాంస్కృతిక వైభవానికి రెండు ధృవ తారలు ప్రయాగ్ కుంభమేళా మరియు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర. ఉత్తర భారతాన త్రివేణి సంగమ తీరాన ఉప్పొంగే కుంభమేళా వైదిక ధర్మానికి, మోక్ష మార్గానికి పరాకాష్ఠ అయితే, దండకారణ్య అంతర్భాగంలో ప్రతిధ్వనించే మేడారం జాతర అణచివేతపై గెలిచిన అస్తిత్వ ఘోష. ప్రపంచవ్యాప్తంగా అనేక మతపరమైన ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ, ఎటువంటి రాజ్యాంగబద్ధమైన ఆహ్వానాలు లేదా ప్రచార ఆర్భాటాలు లేకుండా, కేవలం జనప దాల మౌఖిక ప్రచారం ద్వారా కోట్ల మందిని ఏకం చేసే మేడారాన్ని ★★"ఆసియా ఖండపు అతిపెద్ద జన విస్ఫోటనం"★★గా నేడు ప్రపంచ సాక్షిగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఒక పండుగ కాదు, ఇది ఆసియా ఖండపు మూలవాసుల పోరాట పటిమకు, ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు సాక్ష్యం. నాగరి కత ముసుగులో నేటి ప్రపంచం తన మూలాలను మర్చిపోతున్న వేళ, మేడారం గద్ద మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని మళ్లీ గుర్తు చేస్తోంది. కుంభమేళా పురాణాల్లోని అమృత బిందువుల కోసం సాగిన అన్వేషణకు ప్రతీక అయితే, మేడారం జాతర ఈ మట్టి మీద చిందిన నెత్తురు చుక్కల నుండి ఉద్భవించిన వీర చరిత్ర. 13వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యపు నిరంకుశ పన్నుల విధింపును ధిక్కరించి, తమ ప్రజల ప్రాణాలను, ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం రణరం గంలో వీరమరణం పొందిన వనితలు సమ్మక్క, సారలమ్మలు. వారి త్యాగం ఒక మతానికో, ఒక కులానికో పరిమితమైనది కాదు; అది సమస్త మానవాళి అన్యాయంపై చేసిన తిరుగు బాటుకు సంకేతం. కుంభమేళాలో మోక్షం కోసం గంగమ్మ ఒడిలో మునకలు వేస్తే, మేడా రంలోని జంపన్న వాగులో స్నానం చేయడం అంటే తమ పూర్వీకుల ధైర్యాన్ని ఒంటబట్టించు కోవడమే. కుంభమేళా ఆధ్యాత్మిక అంతర్మథనం అయితే, మేడారం సామాజిక చైతన్య స్ఫూర్తి. ఈ చారిత్రక నేపథ్యమే మేడారాన్ని ప్రపంచం లోని ఇతర పండుగలకు భిన్నంగా నిలబెడు తోంది. దైవత్వం అనేది ఆకాశం నుండి ఊడిప డలేదు, అది సామాన్య ప్రజల కష్టాల నుండి, వారి పోరాటం నుండి ఉద్భవించిందని మేడారం నిరూపిస్తుంది. మేడారం జాతర ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ ప్రకృతిని మించిన దైవం లేదు. ఆధునిక ప్రపంచం పర్యావరణ పరిరక్షణ గురించి నేడు సిద్ధాంతాలు వల్లిస్తుంటే, మేడారం జాతర శతాబ్దాలుగా ప్రకృతితో మమేకమై ఎలా జీవించాలో ఆచర ణాత్మకంగా చూపిస్తోంది. ఇక్కడ రాతి విగ్రహాలు ఉండవు, భారీ గోపురాలు ఉండవు. అడవిలోని చెట్ల కింద గద్దెలే దైవ స్వరూపాలు. భక్తులు సమర్పించే 'బంగారం' (బెల్లం) వెనుక ఉన్న తాత్వికత అద్భుతమైనది. తమ కష్టార్జి తాన్ని, ప్రకృతి ప్రసాదించిన తీపిని దైవానికి అంకితం ఇవ్వడం ద్వారా గిరిజన జీనవశైలి లోని నిరాడంబరతను చాటిచెబుతారు. ఇది ఆసియా ఖండపు ప్రాచీన తెగల సామాజిక సంప్రదాయానికి నిలువెత్తు సాక్ష్యం. కోయ పూజారుల ఆధ్వర్యంలో అత్యంత నిగూఢంగా సాగే ఈ జాతర, ఆసియాలోని గిరిజన అస్తిత్వా నికి ఒక తలమానికం. ఈ జాతరలో వినిపించే డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలు కేవలం వినోదం కోసం కాదు, అవి ఒక జాతి యొక్క జీవన లయను ప్రతిబింబిస్తాయి. ఈ జాతర ప్రాముఖ్యత కేవలం భక్తికి మాత్రమే పరిమితం కాలేదు. ఇది ఒక సామాజిక విప్లవం. ఆసియా ఖండంలో గిరిజన తెగల ఉనికిని, వారి పోరాట పటిమను చాటిచెప్పే ఇంత పెద్ద కార్యక్రమం మరొకటి లేదు. కుంభమేళాలో సాధువులు, పీఠాధిపతులు ఎలాగైతే ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేస్తారో, మేడారంలో సామాన్య గిరిజన పూజారులు ప్రకృతితో ఎలా మమేకమై జీవించాలో లోకానికి చాటిచెబుతారు. ఒకవైపు ఆధునికత ప్రపంచాన్ని చుట్టేస్తున్నా, నేటికీ కోట్లాది మంది ప్రజలు తమ మూలాలను వెతుక్కుంటూ అడవి బాట పట్టడం ఆసియా ఖండపు సాంస్కృతిక బలాన్ని సూచిస్తుంది. ఇది కేవలం ఒక మతానికి సంబంధించినది కాదు, మానవజాతి చరిత్రలో అణచివేతపై గెలిచిన ధైర్యానికి సంబంధించినది. ఇన్ని కోట్ల మంది ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా, ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా గడపడం అనేది ప్రపంచ దేశాలకు ఒక గొప్ప పాఠం. ప్రయాగ్ కుంభమే ళాకు యునెస్కో (UNESCO) వంటి అంత ర్జాతీయ సంస్థల గుర్తింపు లభించినట్లే, మేడారం జాతరను కూడా ★★"ఆసియా ఖండపు అమూర్త సాంస్కృతిక వారసత్వ సంపద"★★గా గుర్తించాలి. అప్పుడు మాత్రమే ఆసియాలోని గిరిజన తెగల చరిత్రకు, వారి అరుదైన ఆచారాలకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం లభిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వానికి నిజమైన అర్థం మేడారంలో కనిపిస్తుంది. కుల మతాల భేదం లేకుండా కోట్ల మంది ప్రజలు ఒకే వరుసలో నిలబడటం సామాజిక ప్రజాస్వా మ్యానికి పరాకాష్ఠ. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు కూడా గర్వంగా జరుపుకునే ఈ పండుగ, భారతదేశపు అసలైన గుండె చప్పుడు. నేటి యాంత్రిక జీవనంలో మానవ సంబంధాలు మృగ్యమౌతున్న వేళ, మేడారం వంటి జాతరలు మనుషులను మళ్లీ మట్టికి, మమకారానికి చేరువ చేస్తున్నాయి. ములుగు జిల్లాలోని ఈ దట్టమైన అరణ్యం కేవలం చెట్ల సమూహం కాదు, అది కోట్లాది మంది ఆశలకు, నమ్మకాలకు నిలయం. మేడారం జాతరను ఆసియా ఖండపు అద్భుతంగా ప్రపంచం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతర్జాతీయ పర్యాటక రంగంలో ఈ జాతరను చేర్చడం ద్వారా గిరిజన కళలు, వారి వైద్య విధానాలు, జీవన శైలి ప్రపం చానికి పరిచయం అవుతాయి. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు, తరతరాలుగా ప్రవహిస్తున్న భారతీయ జీవన స్రవంతి. మట్టిని ప్రేమించే మనస్తత్వం, అన్యాయాన్ని ఎదిరించే పౌరుషం ఉన్నంత కాలం సమ్మక్క-సారలమ్మల గాథ ఆసియా ఖండం గర్వించే మహా చరిత్రగా నిలి చిపోతుంది. అరణ్య గర్భాన ఉద్భవించిన ఈ జనసముద్రం, మానవ నాగరికతకు ఒక గొప్ప పాఠం. ప్రయాగ్ కుంభమేళా భారతదేశపు ఆధ్యాత్మిక ఆత్మ అయితే, మేడారం జాతర భార తదేశపు పోరాట పటిమకు దర్పణం. ఈ రెండు మహా సంగమాలు ఈ దేశపు భిన్నత్వాన్ని ఒకే దారంతో కట్టి ఉంచుతాయి. ఆసియా ఖండపు అస్తిత్వ ఘోషగా మేడారం ఎప్పటికీ చరిత్ర పుటల్లో వెలుగుతూనే ఉంటుంది.

**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**



## హెచ్`1బీ వీసాల దుర్వినియోగం

న్యూయార్క్ : హెచ్`1బీ వీసాల దుర్వినియోగం ఆరోపణలపై టెక్సాస్ చర్యలు చేపట్టింది. స్థానికంగా ఉన్న కొన్ని సంస్థలను లక్ష్యంగా చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టింది. ఈ మేరకు టెక్సాస్ ఆఫీస్ ఆఫ్ అటార్నీ జనరల్ తాజాగా ఓ ప్రకటనను విడుదల చేసింది. ఉత్తర టెక్సాస్‌కు చెందిన మూడు సంస్థలకు సివిల్ ఇన్వెస్టి గేషన్ డిమాండ్స్ జారీ చేసినట్లు అటార్నీ జనరల్ కెన్ పాక్స్‌టన్ ఆ ప్రకటనలో వెల్లడించారు. దీంతో ఆ కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, నియామక విధానాలకు సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు 'ఘోస్ట్' సంస్థలను సృష్టించి హెచ్`1బీ వీసాలను పొందేందుకు మోసపూరిత విధానాలను అనుసరించి ఉంటారని దర్యాప్తు అధికారులు అనుమాని స్తున్నారు. అయితే, ఆ కంపెనీలు ఏంటనే వివరాలను మాత్రం అటార్నీ జనరల్ కార్యాలయం వెల్లడించలేదు. హెచ్`1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగంపై పెద్దఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ.. టెక్సాస్ ఈ దర్యాప్తు చేపట్టడం స్థానికంగా ప్రాధాన్యం సంతరించు కుంది. ఇప్పటికే కొత్త హెచ్`1బీ వీసా దరఖాస్తులను తక్షణం నిలిపివేయాలని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యా ప్తంగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# కుష్టు వ్యాధికి చికిత్స ఉంది భయపడొద్దు

**(30 జనవరి "జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినం" సందర్భంగా)**

మహాత్మా గాంధీ తన జీవితకాలంలో "కుష్టు వ్యాధి" లేదా "లెప్రసీ" లేదా "హాన్సెన్స్" రోగానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే, దాని నివారణకు ఎంతగానో కృషి చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా 30 జనవరి రోజు "జాతీయ కుష్టు వ్యతిరేక దినం(ఆంటీ-లెప్రసీ డే)"ను పాటించడంతో పాటు "అమరవీరుల దినోత్సవం" కూడా నిర్వహించుకోవడం ఆనవా యితీగా మారింది. గత ఏడు దశాబ్దాలకు పైగా ప్రతి ఏట జనవరి మాసం చివరి ఆదివారం, అనగా 25 జనవరి 2026 రోజు "ప్రపంచ కుష్టు వ్యాధి దినం"గా కూడా పాటించడం జరుగు తోంది. కుష్టు వ్యాధిని ముందస్తు గుర్తించడం, తగు చికిత్స తీసుకోవడం, సూచించినా జాగ్రత్తలు తీసుకోని ఆ వ్యాధి వ్యాప్తిని కట్టడి చేయడం, వ్యాధి పట్ల కనీస అవగాహన కలిగిన ఉండడం, వ్యాధిగ్రస్థుల పట్ల ఆదరణ చూపడం లాంటి అంశాలను వివరించడానికి జాతీయ కుష్టు వ్యతిరేక దినం వేదికలు ఉపయోగపడుతున్నాయి. కుష్టు వ్యాధి చుట్టు భయం, అపోహలు, సామాజిక కళంకాలు, వివక్ష, సామాజిక బహిష్కరణలు అంటుకొని ఉన్నాయి.

కుష్టు వ్యాధి అధికంగా ఉన్న దేశాలు:

డబ్ల్యూహెచ్ఓ అంచనాల ప్రకారం, 2005లోనే కుష్టు వ్యాధిని నిర్మూలించబడిన ప్రజారోగ్య సమస్యగా గుర్తించినప్పటికీ 2021లో ప్రపంచవ్యాప్తంగా 1.41 లక్షల కొత్త కేసులు నమోదు అయ్యాయి. ప్రపంచ దేశాల్లో భారత్, ఇండోనేషియా, బ్రెజిల్, ఆఫ్రికన్ దేశాలు, ఆగ్నేయ ఆసియా దేశాల్లో దాదాపు 74 శాతం కుష్టు రోగులు ఉన్నట్లు తేలింది. ఇండియాలో 2020-21 ఏడాదిలో ప్రతి 10,000 జనాభాలో 0.4 శాతం కుష్టు రోగులు నమోదు అయ్యారు. కుష్టు రోగులు నేటికీ కళంకితులుగానే పరిగణించబడుతున్నారు. ఈ రోగులను పౌర సమాజం వెలి వేయడం జరుగుతున్నది. 1981లో ప్రతి పది వేల జనాభాకు 57.2 మందికి వ్యాధి సోకగా, 2025లో కేవలం 0.57కి తగ్గి పోవడం హర్షదాయకం. నయం చేయదగిన వ్యాధి అయినప్పటికీ దాని పట్ల అపోహలు మాత్రం డిజిటల్ కాలంలో కూడా కొనసాగడం దురదృష్ట కరం.

కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణోపాయాలు:

కుష్టు వ్యాధి నివారణకు బిసిజీ టీకాలు తీసుకోవడం, ముందస్తు రోగ నిర్ధారణ చేయడం, సరైన చికిత్స అందించడం, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం, గోరు వెచ్చని నీటిని తాగడం, విటమిన్లు/పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవాలి. చర్మం రంగు మారడం, స్పర్శ కోల్పోవడం, శ్వాసకోశ ఇబ్బందులు, ఒత్తిడి, నొప్పి, వేడి లేదా చలి, కండరాల బలహీనత, నయం కాని పూత, కళ్ళు మూసుకోలేకపోవడం, వైకల్యం రావడం, దృష్టి లోపం లాంటి ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. కుష్టు రోగుల నోటి నుంచి విడుదలయ్యే బిందువుల ద్వారా ఈ వ్యాధి ఆరోగ్యవంతులకు వ్యాపిస్తుంది.

కుష్టు వ్యాధికి పూర్తి చికిత్స ఉన్నది. దీనిని ముందస్తు గుర్తించడం ద్వారా త్వరగా నయం చేయవచ్చు. కుష్టు కారణ "మైకోబ్యాక్టీరియం లెప్రే" అనబడే బ్యాక్టీరియాను చంపడానికి "మల్టీ డ్రగ్ థెరపీ" అని పేర్కొనబడే మూడు ఆంటీబయాటిక్స్ కలయికను ఉపయోగిస్తారు.

**లయన్: కెప్టెన్: డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# 20వ శతాబ్దంలో ప్రపంచ మహాశక్తిగా అవతరించిన మహాత్ముడు

**(30 జనవరి "అమర వీరుల దినోత్సవం" సందర్భంగా)**

20వ శతాబ్దపు ప్రపంచ మేటి ఘనుల్లో ప్రముఖమైన మహాశక్తిగా నేటికీ నిలుస్తున్నారు మన మహాత్మాగాంధి. భారతీయులకే కాకుండా నెల్సన్ మండేలా, లూథర్ కింగ్ జూనియర్ లాంటి అనేక విశ్వ విఖ్యాత నాయకులకు సహితం ప్రేరణగా నిలిచిన మోహన్‌దాస్ కమర్‌చంద్ గాంధీ జీవితం నేటికీ మానవాళికి దారి దీపంగా నిలుస్తున్నది. భారతీయ లాయర్, రాజకీయ నాయకులు, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్త, సాహితీవేత్త, అతి సాధారణ జీవనశైలిని పరిచయం చేసిన మహా నేత అయిన గాంధీ అహింస అనే పదునైన ఆయుధాన్ని ప్రయోగించి బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించి భరతమాతకు స్వేచ్ఛను ప్రదానం చేశారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధిం చిందనే సంతోషంతో పాటు దేశ విభజన గాయా లనతో బాధ పడుతున్న వేళ 30 జనవరి 1948న హిందుత్వవాది నాథురామ్ వినాయక్ గాడ్సె తూటాలకు తుది శ్వాస విడిచారు.

### అమర వీరుల దినోత్సవం:

మహాత్మాగాంధీ వర్ధంతి 30 జనవరి రోజున దేశవ్యాప్తంగా "అమర వీరుల దినం (మార్టిర్స్ డే)" లేదా "గాంధీ పుణ్య తిథి" లేదా "షహీది దివస్"గా పాటించడం ఆనవాయితీగా మారింది. గాంధీ పట్ల అభిమానంతో రవీంద్రనాథ్ టాగూర్ తొలిసారి "మహాత్మా" అని పిలవడంతో వారి పేరు మహాత్మాగాంధీ అని, "జాతి పిత"అని, ప్రేమతో "బాపు" అని నోరారా పిలుచుకునే గాంధీ జీవితం భరతమాత సేవకు అర్పించారు. అహింస, ఏకత, మానవీయత లాంటి సమోన్నత విలువలను మానవాళికి పరిచయం చేసిన అసమాన మానవతీమూర్తి మన బాపు. గుజరాత్ రాష్ట్ర పోర్బందర్ పట్టణంలో 02 అక్టోబర్ 1869న జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ లండన్‌లో బారిస్టర్ పట్టాను పొంది 21 ఏండ్ల పాటు దక్షిణ ఆఫ్రికాలో గడిపారు. అక్కడ నెలకొన్న జాతి వివక్ష, అసమానతలను చూసిన చలించారు.

### స్వాతంత్ర్య ఉద్యమ రూపశిల్పి:

దక్షిణ ఆఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ ఆ ఉద్యమ స్వరూపాన్ని ఆసాంతం మార్చి వేసి బ్రిటీష్ తెల్ల దొరల గుండెల్లో ధడ పుట్టించారు. అహింస అనే అత్యంత పదునైన ఆయుధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని కొనసాగి స్తూనే, వలస పాలకులతో చర్చలు జరుపుతూ, చివరకు బ్రిటీష్ పాలనకు అంతం చూపగలిగారు. సత్యం, అహింస, క్షమాగుణం, నిస్వార్థ సేవ, సానుకూల భావనలు, మానసిక దృఢత్వం, త్యాగం, సత్యాగ్రహాలను పునాదులుగా చేసుకొని ఉద్యమాగ్నికి ఆజ్యం పోశారు. తన జీవిత చరిత్రను "మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రుథ్" అనే ఆత్మకథను రాసి భవిష్యత్తు తరాలకు సన్మార్గం చూపుతు న్నారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, ఖాళీ ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, దండి మార్చ్ లాంటి అనేక రకాలైన ఉద్యమాలను నడిపి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టారు

క్రమశిక్షణ, శాంతి, సమానత్వం, నైతికత, మానవీయ విలువలను శాశ్వత ఆభరణాలు ధరించి జీవితాన్ని కొనసాగించిన గాంధీ మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ఆదర్శాల తరంగాలు భారత్‌లో మాత్రమే కాకుండా ప్రపం చమంతటా వ్యాపించడం వాస్తవం, అనుసర ణీయం. మానవీయ విలువ నిలువెత్తు రూపం మహాత్మాగాంధీ. చొక్కా తొడగడం వదిలి విలువల వస్త్రాలను ధరించి సాదాసీదా జీవితాన్ని మహోన్నతంగా గడిపిన గాంధీ ఐన్‌స్టీన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త చేత మహోన్నతుడిగా కొనియాడబడడం హర్షదాయకం, ఆశ్చర్యకరం. గాంధీ చూపిన బాటలో నడుస్తూ, సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకుంటూ, విలువల పాటించి వ్యక్తిగతంగా ఎదుగుతూ, దేశాభివృద్ధికి సహకరిద్దాం, 'భారతమాతా కీ జై' అంటూ నినదిద్దాం.

# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

**కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు**
**టీవీ సిరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్**
**మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు**
**మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్**

న్యూఢి : తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం విడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపిం చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగుపరచడానికి కాల యాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగా ణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగా ణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆరఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపా లిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు.

# టీ తాగడం వల్ల లాభాలు



మనలో చాలా మంది టీ ని ఎంతో ఇష్టంగా తాగుతూ ఉంటారు. ఇది మన శరీరానికి ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు మనకు వివిధ ఆరోగ్య ప్రయోజనాలు కలిగేలా చేస్తుంది. అద్భుతమైన సమ్మేళనాలతో నిండిన టీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల ప్రమాదం కూడా తగ్గుతుంది. మెదడు శక్తి పెరగడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు టీని తాగే వారు ఎక్కువ కాలం జీవిస్తారని నిపుణులు చెబుతున్నారు. నీటి తరువాత అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలలో టీ ఒకటి. టీ తాగడం వల్ల వచ్చే ప్రశాంతత కారణంగా దీనిని తాగడానికి అందరూ ఇష్టపడతారు. టీ 5,వేల సంవత్సరాల నాటిది. దీనిని చైనాలో కనుగొన్నారు.

**రోగ నిరోధక శక్తికి..**


వివిధ సంస్కృతులు, సంప్రదాయాల కారణంగా టీని తయారు చేసే పద్ధతిలో మార్పులు వస్తున్నాయి. టీలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. ఇందులో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని పెంపొందించడంలో, శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో, శరీర శ్రేయస్సును పెంచడంలో మనకు ఎంతో సహాయపడుతుంది. టీ లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటా యి. స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది. టీ ని తాగడం వల్ల మరణ ప్రమాదం 9 నుండి 13 శాతం వరకు తక్కువగా ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు. టీ తాగడం వల్ల సహజమైన ఉత్తేజం వస్తుంది. దీనిలో కెఫిన్ , ఎల్– థియనిన్ కలిసి ఉంటాయి. దీంతో టీ తాగడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.

**మెదడు పనితీరుకు..**

టీ లో ఉండే ఎల్– థియనిన్ అనే అమైనో అమ్లం ఏకాగ్రతను పెంచడంలో సహాయపడుతుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. టీ మెదడుకు ఒక అద్భుతమైన పానీయంలా పని చేస్తుందని నిపుణులు చెబు తున్నారు. కాఫీలా కాకుండా టీ తాగడం వల్ల కెఫిన్ నెమ్మదిగా గ్రహించబడుతుంది. దీంతో స్థిరమైన శక్తి లభిస్తుంది. టీ లో ఉండే ఎల్– థియనిన్ టీకి ఒక గొప్ప రుచిని ఇస్తుంది. టీ తాగడం వల్ల వచ్చే విశ్రాంతిని, ఆనందకరమైన అనుభూతిని కూడా ఈ అమైనో ఆమ్లం ప్రోత్సహిస్తుంది. టీ తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయి. హెర్బల్ టీలను తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. 2018 లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం బ్లాక్ టీ వాసన చూడడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని కనుగొనబడింది.

**బ్లాక్ టీ అయితేనే..**

అలాగే కమోమిల్ టీ, పుదీనా టీ వంటి వాటిని తాగడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. గ్రీన్ టీని తాగడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరిగి బరువు తగ్గుతారు. గ్రీన్ టీ తాగడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి. టీ తాగడం వల్ల శరీరం హైడ్రెటెడ్ గా ఉంటుంది. దీంతో కీళ్ల పనితీరు మెరుగుపడడంతో పాటు జీర్ణక్రియ కూడా సాఫీగా సాగుతుంది. అంతేకాకుండా టీ ని తాగడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. జీర్ణక్రియ ఆరోగ్యానికి కూడా టీ ఎంతో మేలు చేస్తుంది. టీ తాగడం వల్ల పేగుల్లో మంచి బ్యాక్టీరి యా శాతం పెరుగుతుంది. జీర్ణ సమస్యలు తొలగిపోతాయి. టీ తాగేవారు ఎక్కువకాలం పాటు జీవిస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. టీ అనగానే పాలు, చక్కెర, టీ పొడి వేసే తయారు చేసే టీ అనుకుంటారు చాలా మంది కానీ హెర్బల్ టీ, బ్లాక్ టీ, గ్రీన్ టీ వంటి వాటిని తీసుకు న్నప్పుడే మనం ఈ ప్రయోజనాలను పొందవచ్చు. సరైన టీని ఎంపిక చేసుకుని రోజూ ఒక కప్పు మోతాదులో తీసుకోవడం వల్ల దీర్ఘకాలం పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



# దగ్గు సమస్య... దీర్ఘకాలంగా ఉందా..?

**మనం సీజనల్ ఫ్లూ, అలెర్జీ, గొంతు ఇన్ఫెక్షన్, న్యుమోనియా వంటి సమస్యలతో బాధపడినప్పుడు దగ్గు వస్తూ ఉంటుంది. మందులు వాడడం వల్ల లేదా ఇంటి చిట్కాలను ఉపయోగించి మనం దగ్గు నుండి ఉపశమనాన్ని పొందుతాం. ఇది మనందరం చేసేదే. అయితే కొన్నిసార్లు దగ్గు విపరీతంగా, ఎక్కువ కాలం పాటు ఉంటుంది. నిరంతర దగ్గు కొన్ని తీవ్రమైన సంకేతాలను కూడా ఇచ్చే అవకాశం ఉంటుం దని వైద్యులు చెబుతున్నారు. దగ్గు అనగానే మనం ఊపిరితిత్తుల సమస్యగా భావిస్తూ ఉంటాం. కానీ మొండిదగ్గు కొన్నిసార్లు గుండె సమస్యలను కూడా తెలియజేస్తుందని మొండి దగ్గుకు గుండెకు కూడా సంబంధం ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.**

**గుండె కండరాలు గట్టిపడితే..**

దీర్ఘకాలిక దగ్గు గుండె వైఫల్యాన్ని సూచించే సంకేతాల్లో ఒకటి. గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గినప్పుడు, గుండె కండరాలు గట్టిపడినప్పుడు ఇలా జరుగుతుంది. ముఖ్యం గా రుమాటిక్ గుండె జబ్బులతో బాధపడే వారిలో కూడా దీర్ఘకాలిక దగ్గు వంటి లక్షణాలు కనిపి స్తాయి. అలాగే కొన్నిసార్లు గుండె రోగులకు సూచించే రామిప్రిల్ వంటి రక్తపోటు మందుల కారణంగా కూడా దగ్గు రావచ్చు. ఈ దగ్గును మందులు మార్చడం ద్వారా తగ్గించవచ్చు. ఇక దగ్గు మాత్రమే కాకుండా మన శరీరం చూపించే ఇతర సంకేతాలు కూడా గుండె సమస్యలను తెలియజేస్తాయి.

**దృష్టి సమస్యలు..**

ఆకస్మికంగా కంటిచూపు తగ్గడం, కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు, చర్మంపై గజ్జి రావడం, చేతి వేళ్ల రంగు మారడం, జననేంద్రియ ప్రాంతంలో వాపు రావ డం, ఆకస్మికంగా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కూడా గుండె సమస్యలను తెలియజేస్తాయి. దృష్టిలో పం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడే వారి లో కన్‌స్ట్రిక్టివ్ పెరికార్డిటిస్ అనే గుండె సంబంధిత సమ స్య ఉండే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

**అంతర్గత ఒత్తిడి..**

గుండె చుట్టూ పొర ఏర్పడి గుండె అంతర్గత ఒత్తిడిని పెంచడంతో పాటు గుండెలో ద్రవం పేరుకుపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

ఇక మరో స్పష్టమైన లక్షణం వేళ్లు నీలిరంగులోకి మారడం. ఇన్ఫెక్టివ్ ఎండోకార్డిటిస్ అనే గుండె సమస్య కారణంగా వేళ్లతో పాటు శరీరంలో వివిధ భాగాలు గడ్డకట్టడం వల్ల ఇలా జరుగుతుంది. కనుక దీర్ఘకాలం పాటు ఉండే దగ్గును సాధారణ దగ్గుగా భావించకపో వడం మంచిది. అలాగే దగ్గు వచ్చిన ప్రతిసారి ఊపిరితి త్తుల సమస్య అని కూడా భావించకూడదు. దీర్ఘకాలం పాటు తీవ్రమైన దగ్గు ఉండే వెంటనే వైద్యుడిని సంప్ర దించడం మంచిది.

# అల్లంలో అనేక ఔషధ గుణాలు

**వంటగదిలో మనం వాడే పదార్థాల్లో అల్లం కూడా ఒకటి. దాదాపు మనం తయారు చేసే అన్ని రకాల వంటకాల్లో అల్లాన్ని వాడుతూ ఉంటాం. అల్లంలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియకు మద్దతు ఇవ్వడంలో, నోటి ఆరోగ్యాన్ని కాపాడడంలో, స్త్రీలల్లో వచ్చే నెలసరి నొప్పిని తగ్గించడంలో, వాపులను తగ్గించడంలో, కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో ఇలా అనేక రకాలుగా అల్లం మన ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే అల్లం మన ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ దీనిని వాడే విషయంలో తప్పలు చేయడం వల్ల అల్లం వల్ల కలిగే ప్రయోజనాలను మనం పొందలేం. అల్లాన్ని తీసుకునే విషయంలో మనం చేస్తున్న ప్రధాన తప్పల గురించి ఇప్పడు తెలుసుకుందాం.**



**ఎక్కువ సేపు ఉడికించడం..**

అల్లాన్ని ఎక్కువ సేపు ఉడికించడమనేది మనం చేస్తున్న పెద్ద తప్పు. అల్లాన్ని ముదురు రంగు వచ్చే వరకు వేయించడం వల్ల దానిలో ఉండే సహజ సమ్మే ళనాలు విచ్ఛిన్నం అవుతాయి. దీంతో పాటుగా దాని రుచి, ఆరోగ్య ప్రయోజ నాలు కూడా తగ్గుతాయి. అల్లాన్ని కొద్దిగా వేయించడం లేదా వంట చివర్లో వేయడం వల్ల మన ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. అల్లాన్ని తక్కువగా వేయించడం వల్ల దాని రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా చెక్కు చెదరకుండా ఉంటాయి. అలాగే ఒకే సమయంలో ఎక్కువ అల్లాన్ని వాడడం వల్ల కూడా మనం తగిన ప్రయోజనాలను పొందలేం. అల్లం ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆమ్లత్వం, కడుపులో అసౌకర్యం వంటి ఇబ్బందులు తలె త్తుతాయి. కనుక వంటల్లో తక్కువ మొత్తంలో అల్లాన్ని వాడాలి. తక్కువ మోతాదులో అల్లాన్ని తీసుకున్నప్పుడే జీర్ణక్రియకు మేలు కలుగుతుంది.

**తొక్కతో సహా..**

అలాగే చాలా మంది పాత అల్లాన్ని, ఎండిన అల్లాన్ని కూడా వాడుతూ ఉంటారు. పాత అల్లం కంటే తాజా అల్లమే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఎండిన అల్లంలో రుచితో పాటు, వాసన, పోషకాలు కూడా తగ్గుతాయి. కనుక తాజా అల్లాన్నే ఎక్కువగా ఉపయోగించాలి. అల్లాన్ని సరిగ్గా నిల్వ చేయడం వల్ల ఎక్కువ కాలం పాటు తాజాగా ఉంటుంది. అలాగే మనం అల్లంపై ఉండే తొక్కను తొలగించిన తరువాతే వాడుతూ ఉంటాము. కానీ వీలైనంత వరకు అల్లాన్ని తొక్కతో సహా ఉపయో గించాలి. అల్లం తొక్కలో రుచి, వాసనతో పాటు ప్రయోజనకరమైన సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. అల్లం తొక్క తీయడానికి కత్తికి బదు లుగా చెంచా ఉపయోగించడం వల్ల వ్యర్థాలు, పోషకాలు ఎక్కువగా తొలగి పోకుండా ఉంటాయి.

**సరైన సమయంలో వేయాలి..**

ఇక వంటల్లో అల్లాన్ని వేయగానే దాని రుచి, వాసన రెండూ మారిపోతాయి. కనుక వంట మొదట్లోనే అల్లాన్నివేసి కొద్దిగా వేయించాలి లేదా వంట పూర్తి చేసే ముందు తాజాదనం కోసం కొద్దిగా చల్లుకోవాలి. కానీ ఎటూకాని సమయంలో అల్లం ముద్ద వేయడం వల్ల అది కఠినంగా మారడంతో పాటు వంట రుచి కూడా పోతుంది. కనుక వంటల్లో అల్లాన్ని సరైన సమయంలో వేయడం తెలిసి ఉండాలి. ఈ విధంగా మనలో చాలా మంది అల్లాన్ని తీసుకునే విషయంలో తప్పులు చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. అల్లాన్ని తీసుకునే సరైన పద్ధతులు తెలిసినప్పుడే మనం దాని వల్ల కలిగే ప్రయోజనాలను పొందవచ్చని వారు చెబుతున్నారు.

## మార్కెట్

# మా బంగారమే

## ప్రపంచవ్యాప్తంగా 5000 టన్నుల పసిడికి గిరాకీ..!

గతేడాది ప్రపంచవ్యాప్తంగా బంగారం డిమాండ్ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. ప్రపంచ స్వర్ణమండలి (WGC) నివేదిక ప్రకారం.. 2025లో మొత్తం బంగారం డిమాండ్ తొలిసారి ఐదు వేల టన్నులు దాటింది. 2024లో ఇది 4,961.9 టన్నులుగా ఉండగా.. 2025లో 5,002 టన్నులకు పెరిగింది. పెట్టుబడులకు సురక్షిత మార్గంగా భావించడం వంటివి డిమాండ్ పెరుగుదలకు కారణమైనట్లు తెలుస్తోంది. పెట్టుబడుల రూపేణా పసిడి డిమాండ్ 2024లో 1,185.4 టన్నులుగా ఉండగా.. గత ఏడాది 2,175.3 టన్నులకు పెరిగింది. సెంట్రల్ బ్యాంకులు 2025లో 863 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. నేషనల్ బ్యాంక్ ఆఫ్ పోలాండ్ అత్యధికంగా 102 టన్నులు కొనుగోలు చేసింది. రికార్డు స్థాయి ధరల నేపథ్యంలో గత ఏడాది ప్రపం చవ్యాప్తంగా ఆభరణాల డిమాండ్ మందగించింది. 2024తో పోలిస్తే 18 శాతం తగ్గింది. కానీ, విలువపరంగా 18 శాతం పెరిగి 172 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ ఏడాది సైతం ఆర్థిక, భౌగోళిక రాజకీయ అస్థిరతలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించకపోవ డంతో.. బంగారానికి డిమాండ్ కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూజీసీ సీనియర్ మార్కెట్స్ అనలిస్ట్ లూయిస్ స్ట్రీట్ తెలిపారు. 2026 మొదటి నెలలోనే బంగారం ధర ఔన్సుకు 5,000 డాలర్ల మార్కును దాటిందని, సురక్షిత పెట్టుబడిగా బంగారం పాత్రను ఇది చాటిచెబుతోందన్నారు. భారత్‌లో మాత్రం గత ఏడాది పుత్తడికి డిమాండ్ తగ్గడం గమనార్హం. 2024లో ఇది మొత్తం 802.8 టన్నులుగా ఉండగా.. 2025లో 11 శాతం తగ్గిపోయి 710.9 టన్నులకు పడిపోయింది. రికార్డు స్థాయిలో ధరలు, మారుతున్న వినియోగదారుల కొనుగోలు విధానాలు దీనికి దారితీసినట్లు డబ్ల్యూజీసీ తన నివేదికలో తెలిపింది. 2026లో దేశంలో బంగారం డిమాండ్ 600– 700 టన్నులుగా ఉంటుందని డబ్ల్యూజీసీ అంచనా వేసింది. స్వర్ణాభరణాల విషయంలోనూ గత ఏడాది దేశంలో డిమాండ్ తగ్గింది. 2024లో 563.4 టన్నులతో పోలిస్తే 24 శాతం తగ్గి 430.5 టన్నులకు చేరింది. అయితే, విలువ విషయంలో 2024లో నమోదైన రూ.4,04,510 కోట్లతో పోలిస్తే 12 శాతం పెరిగి రూ.4, 54,390 కోట్లకు చేరుకుంది. డబ్ల్యూజీసీ గణాంకాల ప్రకారం.. 2024లో ఆర్బీఐ వద్ద 73 టన్నుల బంగారం నిల్వలు ఉండగా.. గత ఏడాది అదనంగా 4 టన్నులు కొనుగోలు చేసింది.

# ఛార్జింగ్ కష్టాలకు చెక్..

## *10,001 mAh బిగ్ బ్యాటరీ, క్రేజీ ధరతో రియల్‌మి కొత్త ఫోన్*

Realme P4 Power 5G | ఇంటర్నెట్ డెస్క్: మొబైల్ ఫోన్ ఛార్జింగ్ కష్టాలకు చెక్ పెట్టేలా రియల్‌మి సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ను భారతీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. గత కొంతకా లంగా మొబైల్ కంపెనీలు బిగ్ బ్యాటరీ ఫోన్లను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వాటన్నింటినీ వెనక్కి నెట్టేలా తొలిసారి 10,001 mAh బ్యాటరీ సామర్థ్యంతో రియల్‌మి పీ4 పవర్ మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర, ప్రత్యేకతలు ఏంటి?

realme P4 Power 5G specifications || రియల్‌మి పీ4 పవర్ 6.8 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ 4డీ కర్వ్ డిస్‌ప్లేతో రానుంది. 144Hz రిఫ్రెష్ రేటు, 6500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, హెచ్‌డీఆర్ సపోర్ట్ ఉంటాయి. పెర్ఫామెన్స్ విష యానికొస్తే ఇందులో 2.6 గిగాహెర్జ్ ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 7400 అల్ట్రా ప్రాసెసర్ అమర్చారు. ఐపీ 68, ఐపీ 69, ఐపీ 66 రేటింగ్‌తో డస్ట్, వాటర్ రెసిస్టెన్స్ ఉంది.

realme P4 Power 5G camera || ఈ ఫోన్‌లో వెనుకవైపు డ్యుయల్ కెమెరా సెటప్ ఇచ్చారు. 50 ఎంపీ (సోనీ ఐఎంఎక్స్ 882 సెన్సర్) మెయిన్ కెమెరాతో వస్తున్న ఈ మొబైల్ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌ను సపోర్ట్ చేస్తుంది. రెండోది 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా. ముందువైపు 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. మెయిన్ కెమెరాతో 4కె, 30fpsలో వీడియోలను రికార్డు చేయొచ్చు. ఫ్రంట్ కెమెరా 1080p వరకే సపోర్ట్ చేస్తుంది. ఏఐ ఫీచర్‌తో రానున్న ఈ కెమెరాలు ఫొటోలకు అదనపు హంగులు ఇస్తాయి.

realme P4 Power 5G Battery || ఇక ఈ ఫోన్‌లో ప్రధాన హైలైట్ బ్యాటరీ. ఇప్పటివరకూ ఇండియన్ మార్కెట్‌లో ఇంత పెద్ద బ్యాటరీతో ఏ మొబైలూ రాలేదు. 10,001 mAh టైటాన్ బ్యాటరీని రియల్‌మి ఇందులో అమర్చింది. నెక్ట్స్ జనరేషన్ సిలికాన్ కార్బన్ ఆండో టెక్, డ్యుయల్ లేయర్ కోటింగ్ ప్రాసెస్, సి–ప్యాక్ ప్రొటెక్షన్ బోర్డ్




వంటి కీ ఫీచర్లు జోడించి భద్రత ప్రమాణాలున్న బ్యాటరీని తీసుకొచ్చింది. వీటి వల్ల ప్రస్తుత మొబైల్ ఫోన్ బ్యాటరీలతో పోలిస్తే, 30 శాతం అదనపు జీవితకాలం రావడంతో పాటు, ఎలాంటి ఇబ్బందుల లేకుండా పవర్ డెలివరీ అవుతుంది. 8 ఏళ్ల పాటు పనిచేసేలా బ్యాటరీని తీర్చిదిద్దినట్లు రియల్‌మి చెబుతోంది. నాలుగేళ్ల పాటు హెల్దీ బ్యాటరీ వారెంటీని అందిస్తోంది. ఒకవేళ ఈ సమయంలో 80 శాతం కన్నా తక్కువ సామర్థ్యా నికి బ్యాటరీ పడిపోతే, ఉచితంగా రీప్లేస్ చేయను న్నట్లు హామీ ఇచ్చింది. (ఫస్ట్ సేల్‌లో కొన్నవారికి మాత్రమే ఈ అవకాశం) బాక్స్‌లో 80W సూపర్ వూక్ ఛార్జర్‌ను ఇస్తున్నారు. 36 నిమిషాల్లో 50 శాతం మొబైల్ ఛార్జ్ అవుతుంది. కేవలం 5 నిమిషాలు ఛార్జింగ్ పెడితే హాఫ్ డే వాడుకోవచ్చని కంపెనీ చెబుతోంది. 27w రివర్స్ ఛార్జ్ ఆప్షన్ ద్వారా ఇతర డివైజ్‌లను ఛార్జ్ చేసుకోవచ్చు.

realme P4 Power price in india || ఫోన్ ధర విషయానికొస్తే... ఇది మూడు వేరియంట్లలో లభిస్తోంది. 8 జీబీ+ 128 జీబీ వేరియంట్ ధర రూ.25,999. 8 జీబీ+ 256 జీబీ వేరియంట్ ధర రూ.27,999. హైఎండ్ వేరియంట్ 12 జీబీ+ 256 జీబీ వేరియంట్ రూ.30,999. రియల్‌మి యూఐ 7.0 ఆధారిత ఆండ్రాయిడ్ 16తో రానున్న ఈ మొబైల్‌కు మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, 4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్నారు. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డులతో కొనుగోళ్లపై రూ.2 వేలు అదనపు డిస్కౌంట్ పొందొచ్చు. లేదా ఎక్స్ఛేంజీ బోనస్ రూ.2 వేలు లభిస్తుంది. ఫిబ్రవరి 5 నుంచి realme.com, Flipkart వెబ్‌సైట్స్ ద్వారా ఈ మొబైల్ కొనుగోలు చేయొచ్చు.

## ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు

# జంక్‌ఫుడ్ ప్రచారాన్ని నిషేధించాలి..!



అధిక కొవ్వు, చక్కెర కలిగిన అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగంపై ఆందోళ నలు వ్యక్తమవుతోన్న వేళ కేంద్ర ఆర్థిక సర్వే కీలక సూచన చేసింది. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించే అవకాశాలను పరిశీలించాలని పేర్కొంది. అలాగే చిన్నారులు, పసిపిల్లల పాల ఉత్పత్తులు, పానీయాల మార్కెటింగ్‌పైనా ఆంక్షలు విధించాలని పిలుపు నిచ్చింది. 2025–26 ఆర్థిక సంవత్సరాని కి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ఈ సర్వేలో అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార వినియోగాన్ని తగ్గించే అంశాలపై ప్రస్తావించారు. జంక్‌ఫుడ్‌గా పిలిచే బర్గర్, నూడుల్స్, పిజ్జా, సాఫ్ట్ డ్రింక్ వంటి పదార్థాల కారణంగా దీర్ఘకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు. ''మన దేశంలో 2009 నుంచి 2023 మధ్య జంక్ ఫుడ్ వినియోగం 150శాతానికి పైగా పెరిగింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల రిటైల్ విక్రయాలు విలువ 2006లో 0.9 బిలియన్ డాలర్లు ఉండగా.. 2019 నాటికి అది 38 బిలియన్ డాలర్లకు (40 రెట్లు) పెరిగింది. మహిళలు, పురుషుల్లో ఒబెసిటీ సమస్య దాదాపు రెట్టింపు అయ్యింది. ఏ ఒక్క వినియోగదారుడో తన అలవాట్లను మార్చుకుని సమతుల్య ఆహారం తీసుకున్న మాత్రాన.. ఆరోగ్య భారత్ సాధ్యం కాదు. ఆహార వ్యవస్థలకు సంబంధించి పాలనపరమైన విధానాల్లోనూ మార్పులు రావాలి. జంక్ ఫుడ్ ఉత్పత్తి, మార్కెటింగ్‌ను నియంత్రించాలి'' అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు అన్ని ప్రసార మాధ్యమాల్లో జంక్ ఫుడ్ ప్రకటన లపై నిషేధం విధించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సర్వే సూచించింది. అలాగే, జంక్ ఫుడ్ ఉత్పత్తులపై అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఎంత వినియోగించారో హెచ్చరించేలా న్యూట్రిషన్ లేబుల్‌ను ముద్రించాలని సూచించింది.

# 2008 కంటే దారుణ పరిస్థితులు: ఏఐపై ఆర్థిక సర్వేలో హెచ్చరికలు

సాంకేతిక రంగంలో కృత్రిమమేధ సంచలనాలు సృష్టిస్తోంది. దానిలో భారీ మార్పులు చోటు చేసుకుంటే.. 2008 ఆర్థిక సంక్షోభం కంటే దారుణమైన పరిస్థితులు ఎదురుకావొచ్చని ఆర్థిక సర్వే పేర్కొంది. భారత ఐటీ ఆధారిత వైట్ కాలర్ ఉద్యోగాలకు ప్రత్యక్ష ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు 10 శాతం నుంచి 20 శాతం మేరే ఉండొ చ్చని.. అయితే, దాని తాలూకూ ప్రభావం మాత్రం తీవ్ర స్థాయిలో ఉంటుందని వెల్లడించింది. ''భారత్‌లో ఐటీరంగం వైట్‌కాలర్ ఉద్యోగాల్లో కీలకమైంది. ఏఐ ప్రవేశంతో ఈ రంగంపై తీవ్ర ప్రభా వాలు ఉండొచ్చు. అయితే రాత్రికి రాత్రే ఈ ఉద్యోగాలు పోవు. కానీ ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని విభాగాల్లో ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది'' అని సర్వే పేర్కొంది. విదేశీ సంస్థలకు భారత్ నుంచి తక్కువ వేతనంతో ఐటీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు అవే ప్రమాదంలో పడ్డాయి. ఆ పనులను ఏఐ వేగంగా, తక్కువ ఖర్చుతో చేస్తుండటం దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేం దుకు, ఉద్యోగాలను రక్షించుకునేలా మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఎకనామిక్ కౌన్సిల్ ఉండాలని సర్వే ప్రతిపాదించింది. ''అం తర్జాతీయంగా భౌగోళిక రాజకీయ పోటీ పెరిగింది. ఐరోపాలో భద్రతాపరమైన పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. వాణిజ్య విధానాల విషయంలో రాజకీయ స్వలాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు'' అని సర్వే హెచ్చరించింది.

## బీఎన్‌రెడ్డి నగర్ కాలనీలో పర్యటించిన

# కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



కాప్రా, జనవరి 29 ( నినాదం) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ బిఎన్ రెడ్డి నగర్ లో విస్తృ తంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు యు ఎల్ సి (అర్బన్ ల్యాండ్ సీలింగ్) భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీలో శుభకార్యాలు, సమావేశాల కోసం నూతన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. కాలనీవాసుల సమస్యలను సానుకూలంగా విన్న బొంతు శ్రీదేవి యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బక్రీచెప్యాల నూతన గ్రామ పంచాయితీ

# భవన నిర్మాణానికి భూమిపూజ



సిద్దిపేట, జనవరి 29 (నినాదం):బక్రీచెప్యాల గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని గ్రామ నూతన సర్పంచ్ జక్కుల శ్రీలతశ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల గ్రామంలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి సర్పంచ్ శ్రీలతశ్రీనివాస్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయితీ భవనాన్ని అన్ని సౌక ర్యాలతో నిర్మాణం చేసి వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. నూతన పాలక వర్గం ఆధ్వర్యంలో గ్రామంలో మొట్టమొదటి సారిగా నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉంది. అదేవి దంగా గ్రామంలోని ప్రజలకు అందు బాటులో ఉండి అవసరమైన పనులు చేస్తూ గ్రామా న్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. గ్రామ పంచాయితీ నూతన భవన నిర్మాణానికి అవస రమైన స్థలసే కరణకు సహకరించిన ప్రతి ఒక్కరికి నూతన పాల కవర్గం తరపున కృతజ్ఞతలు తెలుపుతు న్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్, పంచాయితీ కార్యదర్శి శ్రీవాణి, పీఆర్ ఏఈ సౌమ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో

# డిసి బోగేశ్వర్లు ఆర్పీలతో సమావేశం



అల్వాల్, జనవరి 29 (నినాదం) : ప్రతి ఒక్క మహిళనుపొదుపు సంఘాలు చేర్పించడం వీలైనంత వరకు సంఘంలో కొనసాగుటట్లు చూడాలని పొదుపు సంఘాలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించబ డతాయని డిసి బోగేశ్వర్లు పేర్కొ న్నారు. పొదుపు సంఘాలు పైసలను చిన్న చిన్న మొత్తాలను తప్పకుండా కూడబెట్టుకొని ఆర్థి కంగా బలపడేందుకు దోహదపడు తుంది అన్నారు. ముఖ్యంగా మహిళ లు వీటి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పొందుతూ తక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని వ్యాపా రాలు చేసుకుంటూ ఆర్థికంగా బలపరచడానికి ఎంతో మేలు చేస్తాయని తెలియ పరిచారు. 18 సంవత్సరాల పైచిలుకు నుండి పొదుపు సంఘాలుగా ఏర్పాటుకు కృషి చేయాలని ఆర్పీలను కోరారు .వికలాంగులకు కూడా చోటు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ పిఓ ప్రవీణ్ కుమార్, సీఈవో స్వరూప, సురేష్ నాయక్, మరియు ఆర్పీలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలి

### బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, జనవరి29 (నినాదం) : కుత్బుల్లా పూర్ డివిజన్ గణేష్ నగర్ లోని అమృతాలయం నందు గత మూడు రోజు లుగా వైభవోపేతంగా నిర్వ హిస్తున్న ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్ర మానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకా నంద్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవమైన వెంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలని వేడుకున్నట్లు ప్రకటనలో వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి బాపు, దుర్గారావు, మురళి, నర్సింహారెడ్డి, భాస్కర్, నర్సింహా రావు, గణేష్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షులు వనం శ్రీనివాస్, సీనియర్ నాయకులు యాదగిరి, సంతోష్, సాయి, రామకృష్ణ, మధుకర్ రెడ్డి, నార్లకంటి బాలయ్య, పప్పి రెడ్డి సురేందర్ రెడ్డి, రమణా రెడ్డి, భగవాన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజు ఎషబోయిన, కిరణ్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

### వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం

### అందజేసిన కొలను హనుమంత రెడ్డి



కుత్బుల్లాపూర్, జనవరి 29 (నినాదం) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పాలు డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యపై వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కొలన్ హన్మంత్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ లైన్ పనులు, ఔట్లెట్‌లకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, రానున్న రోజుల్లో సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, పద్మారావు, మనోజ్ రెడ్డి,శరత్ చెంద్ర,దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ గాలి పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**శ్రీ రేణుక ఎల్లమ్మ, గాలి పోచమ్మ దేవతామూర్తులకు కన్నుల పండుగగా కళ్యాణ వేడుకలు**

**దేవతామూర్తులకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు**



కుత్బుల్లాపూర్, జనవరి 29 (నినాదం) : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డి నగర్ సమీపంలో ఉన్న శ్రీ గాలి పోచమ్మ బస్తీలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ శ్రీ గాలిపోచమ్మ దేవతా మూర్తుల ఆలయ 11 వార్షికో త్సవ వేడుకలు ఆలయ కమిటీ చైర్మన్ బోదాసు నరసింహ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ గాలి పోచమ్మ దేవత మూర్తులకు కన్నుల పండుగగా కళ్యాణ వేడుకలు ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చరణాల మధ్య కళ్యాణం జరిపించారు. కళ్యాణ అనంతరం దేవతామూర్తులకు ఒడి బియ్యం, కానుకల సమర్పణ వంటి కార్యక్రమాలు ఆలయ చైర్మన్ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. కొలిచిన భక్తుల పాలిట కొంగుబంగారమై వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి శ్రీ గాలి పోచమ్మ దేవతలకు భక్తులు తమ కుటుంబాలు పిల్లాపాపలు చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గాలిపోచమ్మ బస్తీలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు, పోతరాజుల నృత్య విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, శ్రీ గాలిపోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రతి ఏటా జనవరి నెల చివరి చివరి వారంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపటకు ఆనవాయితీగా వస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ బోదాసు నరసింహ తెలిపారు. వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి శ్రీ గాలి పోచమ్మ తల్లి దేవతలకు జరిపించే కళ్యాణ వేడుకలను తిలకించుటకు వందలాదిగా భక్తులు తరలి వచ్చి కళ్యాణ వేడుకలు తిలకించి తరిస్తారని ఈ సందర్భంగా బోదాసు నరసింహ వివరించారు. ఈ కార్యక్రమంలో బోదాసు శ్రీని వాస్, ఎల్లయ్య, ఎస్ రాజు, ఎమ్ లక్ష్మి, దుర్గ, పద్మ, బస్తీవాసులు పాల్గొన్నారు.

## నా భూమని ఆన్‌లైన్

# చేయించండి సారూ



వికారాబాద్, జనవరి 29(నినాదం): నా భూమిని ఆన్ లైన్ చేయించాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించిన నన్ను పట్టించు కోవడం లేదని చివరి ప్రయత్నంగా జిల్లా కలెక్టర్ ను కలసి గోడు చెబుకుందామని వచ్చిన ఓ వృద్ధుడు గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాల యం లో జిల్లా కలెక్టర్ చాంబార్ వద్ద తచ్చా డుతూ కనిపించడం జరిగింది. దోమ మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన జి రాంచంద్రయ్య తండ్రి సాయన్న పేరున సర్వే నెంబర్ 537/1లో రెండు ఎకరాలు లావుణి పట్టా భూమి ఉందని ఈ భూమి కి గతంలో పట్టా నెంబరు 1178 ద్వారా పాసుపుస్తకాన్ని అప్పటి అధికారులు జారీ చేశారు. అయితే గత ప్రభుత్వం ధరణి పేరుతో భూమి ఈకార్డులను ఆన్ లైన్ లో నమోదు చేసిన ప్రింటెడ్ పాసుపుస్తలను జారీ చేసిన నేపథ్యంలో రాంచంద్రయ్య కు చెందిన భూమిని ఆన్ లైన్ చేయలేదు. ఈ విషయం తెలుసుకున్న రాంచంద్రయ్య దోమ రెవెన్యూ కార్యాల యానికి ఎన్ని సార్లు తిరిగి గోడు చెబుకున్న సమస్య తీరలేదని ఈ తరుణంలో కలెక్టర్ ను కలిసి సమస్యను విన్నవించాలని వచ్చినట్లు రైతు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయించి నూతన పాసుపుస్తకం ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మానవసేవే మాధవసేవ 2026

### నూతన సంవత్సర క్యాలెండర్ పంపిణీ



మల్కాజిగిరి, జనవరి 29 (నినాదం) : మానవసేవే మాధవసేవ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మల్కాజిగిరి సాయి నగర్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవసేవే మాధవ సేవ గ్రూపు అధ్యక్షులు కుమ్మరి రాజు, సాయిబాబా దేవాలయ ట్రస్ట్ సభ్యులతో కలిసి భక్తులకు క్యాలెండర్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కుమ్మరి రాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాల య ట్రస్టు సభ్యులు ప్రభాకర్, అశోక్ ముదిరాజ్, సతీష్ , దేవాలయ మేనేజర్ శ్రీనివాస్, మానవసేవే మాధవసేవ సభ్యులు సాంబ రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేయాలి

### ఎంఆర్ఓకు 15 దరఖాస్తులను అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



మల్కాజిగిరి, జనవరి 29 (నినాదం) : కుటుంబ యజమా నిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద వితంతువులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద మల్కాజి గిరిలో 15 మంది బాధితుల దరఖాస్తులను బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉపేందర్, నీలం సతీష్ గురువారం మల్కాజిగిరి మండల తహసీల్దార్ కు అందజేశారు. ఈ పథకం ద్వారా మంజూరయ్యే రూ. 20,000 ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు తక్షణ ఆసరాగా నిలుస్తుం దని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హు లైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయా లని, ఈ దరఖాస్తులను త్వరగా పరిశీలించి నిధులు మం జూరు చేయించి నిరుపేదలను ఆదుకోవాలని కోరారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించండి



దుబ్బాక, జనవరి 29 (నినాదం) : సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సి పల్ పరిధిలో సిపిఎం పార్టీ అభ్యర్థులు 12 వార్డు కంపె రేఖ,, 15 వార్డు గొడ్డుబర్ల మానస,, 17వ వార్డు అభ్యర్థిగా ఎండి సాజిద్.... సిపిఎం పార్టీ నుండి కౌన్సిలర్ అభ్యర్థులుగా ఈరోజు నామినేషన్ వేయడం జరిగింది. ఆయా వార్డుల ప్రజలు ఓటర్స్ ఆదరించి గెలిపించ గలరని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు.కార్మికులు, కర్షకులు, రైతుల సమస్యల పైన పోరాటాలు నిర్వహిస్తూ అనేక సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తున్న పార్టీ సిపిఎం పార్టీ మాత్రమేనని నీతి నిజాయితీగా ప్రజల పక్షాన పోరాడుతూ అభివృద్ధి కొరకు పని చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు.బయట పోరాటంతో పాటు మున్సిపల్ పాలకవర్గంలో కూడా ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన మరియు అభివృద్ధిపై నీతి నిజాయితీగా పనిచేయడానికి సిపిఎం అభ్యర్థులను గెలిపించి పంపాలని కోరారు. అవినీతికి,మోసాలకు అవకాశాలు కల్పించ కుండా పనిచేసే సిపిఎం పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ సీపీఎం దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నాయకులు లక్ష్మీనారాయణ, సత్యలక్ష్మి, దేవమ్మ ,శ్యామల ,శంషుద్దీన్, ఫజియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# ఇసుక అక్రమ రవాణాపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు ట్రాక్టర్ల సీజ్

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్



వికారాబాద్, జనవరి 29(నినాదం): ఇసుక అక్రమ రవాణాపై ముంద స్తు సమాచారం తో లగాయించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు చేసి నాలుగు ట్రాక్టర్ల ను స్వాదీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశానుసారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంతట్టి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిబం ధనలు అతిక్రమించి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న సదరు ట్రాక్ట ర్లను వెంటనే సీజ్ చేసి, బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు డ్రైవర్లతో పాటు, ట్రాక్టర్ల యజమానులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొన సాగుతుందని జిల్లా ఎస్పీ గారు తెలియజేయడం జరిగింది.

# చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు తీసుకోండి

### కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి



అల్వాల్, జనవరి 29 (నినాదం) : అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొత్త చెరువు. చిన్న రాయిని చెరువులలో విస్తరించిన గుర్రపు డెక్క తొలగిం చాలని కోరుతూ జిహెచ్ఎంసి జోనల్ ఎస్ ఈ శ్రీనివాసులు కలిసి విజప్తి చేయడం జరిగిందని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతలశాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు తార్నాక లోని ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ ఇ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి కార్పొరేటర్ అల్వాల్ సర్కిల్ పరిధిలో చెరువుల స్థితిగతులను వివరించడం జరిగిందని కార్పోరేటర్ పేర్కొన్నారు. చెరువులలో పూర్తిగా గుర్రపు డెక్క విస్తరించడంతో స్థానికంగా ప్రజలకు తీవ్ర సమస్యలు ఉత్పన్న అవుతున్నాయని. ప్రధానంగా దోమల బెడద రోజురోజుకు విజృంభిస్తుందని ఫలితంగా పౌరులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. గుర్రపు డెక్క తొలగింపులో ఆలస్యం వల్ల ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభావం చూపుతోందని కార్పొరేటర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇట్టి విషయాన్ని ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిదని ఆమె పేర్కొన్నారు

## పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా

# ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది

**జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్**

**పారిశుధ్య కార్మికులకు ఉచిత సర్వైకల్ బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించిన జోనల్ కమిషనర్, అధికారులు**



మల్కాజిగిరి, జనవరి 29(నినాదం) : పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, అందుకు వారి ఆరోగ్య పరిరక్షణకై జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ క్యాంపు ను నిర్వహించడం జరుగుతుందని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ అన్నారు. కర్కినోస్ ఇండియన్ క్యాన్సర్ సొసైటీ ఒ ఒరాకిల్ సంస్థలు ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని మల్కాజిగిరి, మౌలాలి, అల్వాల్ సర్కిల్ లకు సంబంధించిన పారిశుధ్య కార్మికులకు ఉచిత సర్వైకల్ బ్రెస్ట్ క్యాన్సర్ ఓరల్ స్క్రీనింగ్ నిర్వహించుట గురువారం మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ ఉచిత హెల్త్ క్యాంపును ప్రారంభించినారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కర్కినోస్ ఇండియన్ క్యాన్సర్ సొసైటీ, ఒరాకిల్ సంస్థలు, జిహెచ్ఎంసి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపును జిహెచ్ఎంసి సిబ్బంది అందరూ ఉపయోగించుకోవాలని, ఏదైనా పాజిటివ్ ఉన్నట్లయితే ఇట్టి సంస్థలు వ్యాధి వ్యాప్తి జరగకుండా నిరోధించడానికి పూర్తి స్థాయిలో నయం అయ్యేంత వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తారని, కార్మికులు మద్యం పొగాకు సిగరెట్లు గుట్కా తంబాకు ఒంటి వ్యసనాలకు బానిస కారాదని అపరిశుభ్రమైన వాతావరణంలో విధులు నిర్వహించి కార్మికులు తమ ఆరోగ్య సమస్యలు రాకుండా హెల్త్ చెక్ చేయించుకోవాలని వ్యసనాలకు బానిసలు కాకుండా, కార్మికులు ఎక్కువ శాతం పేదరికం నుండి వచ్చిన వాళ్లే ఉన్నందున వారి ఆరోగ్యం పై శ్రద్ధ కనబరచాలని అనారోగ్యం కు గురైనట్లయితే కుటుంబం ఇంకా ఆర్థికంగా వెనుకబడిపోతుందని, అందుకోసం కార్మికులు సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్య పరీక్షలకు భయపడొద్దని, క్యాన్సర్ పరీక్షలకు ముందుండి మరి నిర్వహించుకోవాలని, సమస్య ఉన్నట్లయితే తొలి దశలోనే నివారణ చర్యలు చేసుకోవచ్చుని తెలిపారు. అనంతరం జిహెచ్ఎంసి ముఖ్య ఆరోగ్య అధికారి పద్మజ మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో అందరూ కార్మికులకు బ్రెస్ట్ క్యాన్సర్ మరియు ఓరల్ స్క్రీనింగ్ పరీక్షలు దశలవారీగా నిర్వహిస్తారని, ఫిబ్రవరి చివరి వారంలో కార్మికుల అందరికీ మరొకసారి స్క్రీనింగ్ టెస్ట్ లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వైద్యాధికారిణి డాక్టర్ కె మంజుల, శ్ గోపాల్ రావు మౌలాలి డిప్యూటీ కమిషనర్ గోపాలరావు, సానిటరీ సూపర్వైజర్ చింత శ్రీనివాస్, ఏఈ (గణ, వృద్ధ ) కిరణ్, పవర్, శానిటరీ జవాన్ భాస్కరరావు, గోవిందమ్మ, వెంకటేష్, గిరి, ఎస్ఎఫ్ఏ, మల్కాజిగిరి మౌలాలి సర్కిళ్లకు సంబంధించిన కార్మికులు, కరికినోస్ హెల్త్ కేర్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐ.పి.ఎస్



వికారాబాద్, జనవరి 29(నినాదం): వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిమోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐ.పి.ఎస్ గురువారం విడుదల చేసిన ప్రకటన లో సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం, పంపిణీని కి అనుమతి లేని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. రూ.50,000 కంటే ఎక్కువ నగదు తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని, సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థా యిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశిం చారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, గతంలో గొడవలు చోటుచేసుకున్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థా యిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నవారు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి, తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

## రెండేళ్లలో చేయని అభివృద్ధి మూడేళ్లలో చేస్తాయ

**మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల**



**కరీంనగర్, జనవరి 29(నినాదం):** గురువారం రోజున 47వ, 21వ డివిజన్ల బారాస అభ్యర్థులు చల్ల స్వరూప రాణి, చల్ల హరిశంకర్ ల నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనా మాజీ మంత్రి గంగుల మొదటగా రాంనగర్లోని రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి. అనంతరం డప్పు చప్పుల మధ్య భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని డివిజన్ ప్రజల ఉద్దేశించి ఎమ్మెల్యే గంగుల మాట్లాడారు. ఈ రెండేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రానికి కరీంనగర్ నగరానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు రూపాయలు కూడా తీసుకు రాలేదని.. పొన్నం ప్రభాకర్ గాని ,బండి సంజయ్ గాని నగరానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు 1650 కోట్ల రూపాయలతో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. కేవలం ఎన్నికల కోసం వచ్చే నాయకుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలు పాలనలో విఫలమయ్యాయని విమర్శించారు. రాబోవు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని.. బిజెపి పార్టీ ఎన్నటికీ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ గా చల్ల స్వరూప రాణి హరిశంకర్లు డివిజన్ ను అన్ని విధాల అభివృద్ధి చేశారని.. వారు మీ ఇంటి బిడ్డగా ఉండి ప్రజల సంక్షేమం కోసమే పనిచేశారని.. వారిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ మేయర్ గానే ఇంత అభివృద్ధి చేస్తే, మళ్లీ బిఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత.. ఒక మేయర్ గా మీ డివిజన్లను ఎంతో అభివృద్ధి చేస్తారని,తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట వారి సోదరులు గంగుల సుధాకర్ బిఆర్ఎస్ నాయకులు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

**అభ్యర్థుల సందేహాలు హెల్ప్ డెస్క్ లో నివృత్తి చేయాలి**

**కరీంనగర్ నామినేషన్ కేంద్రాల పరిశీలన**

**ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, జనవరి 29(నినాదం):** ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సి పల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, హెల్ప్ డెస్క్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా ఎన్నికల సిబ్బంది విధులను పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ వివరాలు ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా డివిజన్ స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి టీ పోల్ యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు స్పష్టంగా వివరించాలని తెలిపారు. చొప్పదండి వార్డు స్థానాలకు అప్పటివరకు దాఖలైన నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రి యను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు.

## జాతరలో ఎమ్మెల్యే కౌశిక్ ఓవరాక్షన్

**పోలీసులపై దురుసు ప్రవర్తన**

**సమ్మక్క గద్దెకు రాకముందే గద్దెనెక్కిన ఎమ్మెల్యే**



**జమ్మికుంట, జనవరి 29 (నినాదం):** వనదేవతల పండుగను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే తరుణంలో ప్రతి సంవత్సరం మాదిరి గానే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన సొంత గ్రామమైన వీణవంకలో ఓవర్ యాక్షన్ చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. వీణవంక మండలంలోని సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ ఎండోమెంట్ అధికారులకు అప్పగించుతూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత 50 సంవత్సరాలుగా పాడి రామకృష్ణారెడ్డి ,పాడి సుధాకర్ రెడ్డి వంశస్థులు సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలను జరపడం పరిపాటిగా వస్తుంది. ఆ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మధ్య ఉన్న తగాదాలతో ప్రతి సంవత్సరం జాతర లో ఇదే తరహా సమస్యలు ఉత్పన్నం అవడంతో పోలీసు లు ముందస్తుగానే హుజురాబాద్ వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఓవరాక్షన్ చేస్తూ సమ్మక్కను గద్దెకు తీసుకొని రావడానికి కంటే ముందే గద్దె పైకి వెళ్లి కొబ్బరికాయ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ తరుణంలో పోలీసులు గొడవలు జరుగుతాయనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో పాటు సిపికి హెచ్చరికలు జారీ చేశాడు.

## రెండో రోజు నామినేషన్ల రష్.. పార్టీల పోటీ హాట్ !



**మెట్‌పల్లి, జనవరి 29 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో రెండో రోజు పట్టణంలో రాజకీయ వేడి మరింత పెరిగింది. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, పార్టీ శ్రేణుల రాకపోకలతో వాతావరణం హాట్‌గా మారింది. ఈ రోజు మొత్తం 92 నామినేషన్లు దాఖలుకాగా, 83 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పార్టీల వారీగా చూస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 37 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నుంచి 23, బీఆర్ఎస్ నుంచి 18 నామినేషన్లు సమర్పించబడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 3, ఏఐఎంఐఎం నుంచి 4 నామినేషన్లు వచ్చాయి. అలాగే 6 మంది స్వతంత్ర అభ్యర్థులు, ఇతర గుర్తింపు పొందిన పార్టీ నుంచి 1 నామినేషన్ దాఖలైంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల నిబంధనల మేరకు ప్రశాంతంగా కొనసాగుతోందని ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టడంతో పాటు, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వారు స్పష్టం చేశారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు

**-స్టేట్ ఎన్నికల అబ్జర్వర్ జితేందర్ రెడ్డి**



**జమ్మికుంట, జనవరి 29 (నినాదం):** జమ్మికుంట మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియ విధానాన్ని స్టేట్ ఎలక్షన్ అబ్జర్వర్ జితేందర్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులు మనోహర్ పరిశీలించారు. జమ్మికుంట పట్టణంలోని 30 వార్డులలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం స్టేట్ ఎలక్షన్ అబ్జర్వర్ జితేందర్ రెడ్డి ఎన్నికల పరిశీలకులు మనోహర్ మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియ విధానం తో పాటు అభ్యర్థులకు సంబంధించిన విధివిధానాలు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను గురించి అధికారులకు కమిషనర్ ఆయాజ్కు వెల్లడించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ప్రతి అభ్యర్థి నుంచి అవసరమైన పత్రాలను తీసుకొని పూర్తిస్థాయిలో పరిశీలించి నామినేషన్ ప్రక్రియ జరిగేలా చూడాలని ప్రతి ఒక్కరు వారికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ ప్రక్రియను కొనసాగించాలని ఆలోపు ఎంత మంది వచ్చినా అందరి నామినేషన్లు పూర్తిగా తీసుకోవాలన్నారు.

### వెంకన్న వేడుకల్లో

## భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్న కృష్ణన్న





**వెంకన్న" వేడుకల్లో భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్న "కృష్ణన్న"**

**కోరుట్ల, జనవరి 29:** కోరుట్ల మండలం గుమ్లాపూర్ గ్రామం అతి పురాతనమైన వెంకన్న కల్యాణంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణన్న హాజరై భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం కోరుట్ల మండలం గుమ్లాపూర్ శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెంకన్న కళ్యాణశీ కన్నుల పండువగా నిర్వహించగా కృష్ణన్న హాజరయ్యారు. వెంకన్న కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వెంకటేశ్వర స్వామితో పాటు అమ్మవార్ల ను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, పాడి పంటలతో రైతులు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల నియోజక వర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రౌట్ల స్రవంతి, ఉప సర్పంచ్ సురనేని అరుణ్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిన్పల్లి సత్యనారాయణ రావు, శ్రీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల ముందు


## కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ప్రణవ్**



**జమ్మికుంట, జనవరి 29 (నినాదం):** హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇప్పల్ నర్సింగాపూర్ 10 వ వార్డు కు చెందిన శనిగారపు మౌనిక శ్రీకాంత్, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు బోరగల అజయ్ ,తో పాటు యూత్ నాయకులు ఈరోజు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ గారు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 10 వ వార్డు చెందిన మౌనిక శ్రీకాంత్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల్లో రెండు హుజురాబాద్ , జమ్మికుంట మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ గూడూరి రాజేశ్వరి-స్వామిరెడ్డి, బొడ్డు మొగిలి,బొడ్డు స్వామి, వల్లు తిరుపతి, హనుమాన్ దేవస్థానం చైర్మన్ కొలిపాక శంకర్,తోట రాజేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



**ధర్మపురి ప్రతినిధి,జనవరి 29 (నినాదం):** అతివలే రాజకీయ కేంద్రబిందువుగా ధర్మపురి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. బుధవారం 10 నామినేషన్లు దాఖలు కాగా గురువారం 40 నామినేషన్లు దాఖలు కాగా రెండు రోజులు కలిపి 50 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నేటి తో నామినేషన్ల దాఖలుకు చివరి అవకాశం ఉండడంతో గురువారంమున్సిపల్ కార్యాలయం చుట్టూ రాజకీయ సందడి నెలకొంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థుల పోటాపోటీతో పురపాలిక పరిధి మొత్తం ఎన్నికల జోష్‌లో మునిగిపోయింది. ధర్మపురి పురపాలిక అధ్యక్ష స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో ఎన్నికల రాజకీయాలు పూర్తిగా మహిళల చుట్టూనే తిరుగుతున్నాయి. మొత్తం ఓటర్లలో మహిళల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉండటంతో, ఈ ఎన్నికల్లో మహిళల నిర్ణయమే తుది తీర్పుగా మారనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నామినేషన్ల సరళి చూస్తే కాంగ్రెస్‌లో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండగా, బీఆర్ఎస్ తమ పాత బలాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఉంది. బీజేపీ కూడా పట్టణ ఓటు బ్యాంకుపై ఆశలు పెట్టుకుని గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. టికెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉండటంతో పలువురు ఆశావహులు స్వతంత్రులుగా నామినేషన్లు వేయడం విశేషం. వార్డు వారీగా పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో ప్రతి వార్డులో పోరు తీవ్రంగా మారుతోంది. ముఖ్యంగా మహిళా అభ్యర్థుల సంఖ్య పెరగడం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రచారం ప్రారంభమయ్యే సరికి రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్ కేంద్రం వద్ద ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న సర్పంచ్ బండమీది కవిత గోపి



**వెల్గటూర్,జనవరి29(నినాదం న్యూస్):** వెల్గటూర్ మండల కేంద్రంలోని పెద్ద గుట్ట వద్ద జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరలో గురువారం వెల్గటూర్ సర్పంచ్ బండమీది కవిత గోపి కుటుంబ సమేతంగా వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా పేరు గడించిన సమ్మక్క సారలమ్మ జాతరను వెల్గటూర్ పెద్ద గుట్ట ప్రతి రెండేళ్లకోసారి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు భక్తుల నుండి కూడా విశేష ఆదరణ లభిస్తుందని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దండుగుల రామయ్య,గౌరవ సభ్యులు దండుగుల రాజయ్య,పల్లపు నర్సింగం దండుగుల గంగరాజు,దండుగుల వెంకటేష్,పల్లపు రాజు,పల్లపు అశోక్, దండుగుల రవీందర్ ఒద్దెర కులపెద్దలు సూర స్వామి,సూర తిరుపతి,సూర మల్లేష్,శివరాత్రి నర్సింగం,శివరాత్రి రాజమౌళి, నర్సింగం ఒళ్లెపు సతీష్,శివరాత్రి సురేష్,పైడిపల్లి గ్రామస్థులు పైడిపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### మూడోసారి బరిలో

## మాజీ మేయర్ సునీల్‌రావు



**కరీంనగర్, జనవరి 29(నినాదం):** 42వ డివిజన్ భగత్‌నగర్ నుంచి మాజీ మేయర్ వై. సునీల్ రావు మూడోసారి ఎన్నికల బరిలోకి దిగారు. గతంలో రెండు సార్లు గెలిచి ఒక టర్మ్ మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆయన తన నామినేషన్‌ను అధికారికంగా దాఖలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు మద్దతు ప్రకటించారు. భగత్‌నగర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా మరోసారి ప్రజల ముందుకు వెళున్నట్లు వై. సునీల్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమం లో రమేష్ గౌడ్, దాసరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### జాతరకు వెళ్తే అడ్డుకున్నారని

## ఎమ్మెల్యే రోడ్డుపై బైఠాయింపు



**ఒక ఆడబిడ్డను నడిరోడ్డుపై నిలబెట్టిన పాపం ఊరికే పోదు**

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**జమ్మికుంట, జనవరి 29 (నినాదం):** సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి జాతరకు వెళున్న హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఎలాంటి కారణం చెప్పకుండా జాతరకు వెళ్లనివ్వకపోవడంపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఎందుకు అనుమతించడం లేదని పోలీసులను ప్రశ్నించినప్పటికీ, వారు ససేమిరా వెళ్లనివ్వకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే రోడ్డుపైనే బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో ఒక ప్రజాప్రతినిధికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటీ?" అని ప్రశ్నించారు. పవిత్రమైన జాతరకు వెళ్లే తనను అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష పూరిత చర్యేనని, రాష్ట్రంలో రౌడీ పాలన కొనసాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. హుజురాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. నడిరోడ్డుపై ఒక ఆడబిడ్డను నిలబెట్టిన పాపం ఊరికే పోదని హెచ్చరించారు. ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల పక్షాన తన పోరాటం ఆగదని, ఈ దమనకాండకు తగిన గుణపాఠం తప్పదని ప్రభుత్వంకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## నేటితో ముగియనున్న నామినేషన్ ప్రక్రియ


**సాయంత్రం ఐదు గంటల వరకే అవకాశం**

**మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**



**జమ్మికుంట, జనవరి 29 (నినాదం):** రాష్ట్ర ఎన్నికల సం ఘం ఆదేశాల మేరకు నేడు 30వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలతో నామినేషన్ ప్రక్రియ ముగు స్తుందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేపు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ వేసే అభ్యర్థులు పార్టీల ద్వారా గానీ, స్వతంత్ర్య అభ్యర్థులు గానీ శుక్రవారం సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్ వేయాలని ఆయన అన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత నామినేషన్ తీసుకోవడం కుదరదని ఆయన తెలిపారు. విధిగా అభ్యర్థులు 5 గంటల లోపే నామినేషన్ కేంద్రానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేయాలని ఆయన పేర్కొన్నారు.


## అంతర్జాతీయ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు



**కరీంనగర్, జనవరి 29(నినాదం):** ఇంగ్లీష్ భాష ద్వారా అనేక ఉపాధి అవకాశాలు ఉంటాయని, సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేం దర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో బంగారు పతకాలు రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యా ర్థులకు ఇంగ్లీష్ భాషలో పట్టు రావాలని, వాటిలోని విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అదేవిధంగా ఇంగ్లీష్ భాషలో పట్టు సాధిం చిన వారికి అనేక అవకాశాలు ఉంటాయని, ఉపాధి అవకా శాలు సైతం మెరుగుపరుచుకోవచ్చని తెలియజేశారు. ఇంగ్లీష్ భాష అంతర్జాతీయంగా గుర్తింపు పొందినటువంటిదని, ఏ దేశంలో అయినా ఉపాధితో స్థిరపడవచ్చని చెప్పారు ఈ క్రమంలో ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జాన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి అంతర్జా తీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు వి.వేదవిహార్, 4వ తరగతి, కె. సుకృత, 5వ తరగతి, బి. తన్మయి, 7వ తరగతి, టీ అమితా విక్రం, 9వ తరగతి మరియు తదితర విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం గొప్ప విషయమని స్ఫూర్తిదాయకమని చెప్పారు.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన వ్యయ పరిశీలకులు

**ధర్మపురి ప్రతినిధి, జనవరి 29 (నినాదం):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాకు నియమితులైన ఎన్నికల వ్యయ పరిశీలకులు డి.శ్రీనివాస్ గురువారం ధర్మపురి మున్సిపాలిటీలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు అందరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు సమర్పించే అన్ని పత్రాలు, ధ్రువీకరణ సర్టిఫికెట్లను రిటర్నింగ్ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిమితిని మించకుండా ఖర్చులు చేయాలని, ఇందుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలని తెలిపారు. ఖర్చులకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా సమర్పించడంతో పాటు, పార్టీ పరంగా జరిగే వ్యయం, పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల వ్యయాన్ని కూడా స్పష్టంగా నమోదు చేయాలని సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



### ఎంఐఎం తాజా మాజీ కార్పొరేటర్ బిఆర్ఎస్‌లో చేరిక



**కరీంనగర్, జనవరి 29(నినాదం):** 37వ డివిజన్ ఎంఐఎం పార్టీ మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ షర్ఫుద్దీన్ వారి అనుచరులతో కలసి ఎంఐఎం పార్టీని వదిలి గురువారం రోజున మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గంగుల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే గంగుల నివాసంలో జరిగింది. ఎమ్మెల్యే గంగుల వెంట బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మహ్మద్ ఫిరోజ్, మహమ్మద్ మోయిజ్ , అఫ్రోజ్ , పలురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## 10 వ వార్డ్ కు నామినేషన్ దాఖలు చేసిన బోడ కవితరమేష్ నాయక్

**డోర్నకల్/మరిపెడ జనవరి 29(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ పదో వార్డు నుండి ఎస్టి మహిళ రిజర్వేషన్ బోడ కవిత రమేష్ నాయక్ ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ వేయడం జరిగింది.ఈ సందర్భంగా బోడ కవిత రమేష్ నాయక్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల కాలం నుండి మాకులతండ ప్రజలకు ఎన్నో రకాలుగా సహాయం చేయడం జరిగిందని వాటిలో భాగంగా మాకుల తండలో అనారోగ్య కారణంగా చనిపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం మరియు ఎన్నో కుటుంబాలకు నిత్యవసర సరుకులు బియ్యం ఇవ్వడం జరిగింది.హాస్పిటల్ లో ప్రాణపాయ స్థితిలో ఉన్న ప్రజలకు 15 సార్లు రక్తదానం చేయడం జరిగింది.హాస్పటల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలకు ఆర్థిక సహాయం అందించడం జరిగింది కరోనా మహమ్మారి సమయంలో 75 కుటుంబాలకు నిత్యవసర సరుకులు కూరగాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు..15 సంవత్సరా మాకులతండ ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని ముందుండి తన వంతుగా సహాయం చేస్తున్నారు.మాకుల తండ స్కూల్ పిల్లలకు గతంలో నోట్ బుక్స్,ప్లేట్స్,పలకలు అన్ని పంపిణీ చేయడం జరిగింది.. ఇలా చెప్పుకుంటూ పోతే గత 15 సంవత్సరాల నుండి ఎన్నో మంచి కార్యక్రమాలు బోడ కవిత రమేష్ నాయక్ చేశారు..మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలందరూ దీవించి పదో వార్డు నుండి భారీ మెజార్టీతో గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను ఇలాంటి మంచి వ్యక్తి మాకుల తండలో పుట్టడం మాకుల తండ ప్రజల అదృష్టంగా భావిస్తున్నారు.భవిష్యత్తులో ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తానని అందరి ముందు మాట ఇవ్వడం జరిగింది.ఈ నామినేషన్ గుగులోతు చందు నాయక్,బోడ రవి నాయక్,ఇస్లావత్ బాలనాయక్,బానోతు ప్రకాష్,బోడ అనిల్ కుమార్,బోడ తరుణ్, తదితరులు పాల్గొన్నారు...

## మన తండా బిడ్డ.. మన వార్డు భవిష్యత్తు!

### నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఇస్లావత్ తిరుపతి నాయక్



**డోర్నకల్/మరిపెడ జనవరి 29(నినాదం)** మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ బక్కరూపుల తండాలో పుట్టి,ఇక్కడి మట్టిలోనే పెరిగి,మీ కష్టసుఖాలను కళ్ళారా చూసిన మీ తమ్ముడు,మీ బిడ్డ ఇస్లావత్ తిరుపతి నాయక్.మున్సిపాలిటీ మొదటి వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున ఈరోజు నామినేషన్ దాఖలు చేయడం జరిగింది.నా తండా వాసుల కళ్లల్లో ఆనందం చూడటమే నా లక్ష్యం.పదవి అనేది నాకు అధికారం కాదు..అది మీ కష్టాలను తీర్చే ఒక బాధ్యత. బక్కరూపుల తండా,దుబ్బ తండా నేతావత్ తండా రుణం తీర్చుకోవడానికి మన వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ఒక అవకాశం ఇవ్వండి.నేను మీ నాయకుడిగా కాదు..మీ ఇంట్లో ఒక సభ్యుడిగా,మీ గొంతుకగా మున్సిపాలిటీలో పోరాడతాను. మన గుర్తు హస్తం..మన లక్ష్యం అభివృద్ధి! ఒక్క అవకాశం ఇవ్వండి. వార్డు రూపురేఖలు మారుద్దాం.మీ ఆశీస్సులే నా బలం.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తండా ప్రజాలు పాల్గొన్నారు....

## 13వ వార్డుకి నామినేషన్ దాఖలు చేసిన కుడితి సాయిప్రియా నర్సింహా రెడ్డి

**డోర్నకల్/మరిపెడ జనవరి 29(నినాదం)** మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని 13 వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నుండి భారీ జనాల నడుమ ర్యాలీగా బయలుదేరి నామినేషన్ దాఖలు కుడితి సాయి ప్రియ నరసింహారెడ్డి,డోర్నకల్ నియోజకవర్గ ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆశీస్సులతో, జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగంధర్ రెడ్డి సహకారంతో నామినేషన్లు దాతలు చేయడం జరిగింది.కాంగ్రెస్ నాయకులు లక్ష్మి నారాయణ,పట్టణ ప్రజాలు ఇంకా తదితరులు పాల్గొన్నారు...




## శ్రీ కాళికాదేవి, శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



**చింతపల్లి:** మండలంలోని కుర్మపల్లి గ్రామంలో కొలువు తీరి, భక్తుల కొంగుబంగారంగా ఎంతో ప్రసిద్ధి పొందిన ఆదిపరాశక్తి శ్రీ కాళికా మహాదేవి ,శ్రీ పోతూలూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి దేవస్థానంలో ఆలయ క్యాలెండర్ ను ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ముంజంపల్లి విద్యాధర చారి, గ్రామ సర్పంచ్ కట్ట మహేష్ తో కలిసి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ చరిత్రలోనే ప్రప్రథమంగా అమ్మవారి క్యాలెండర్ తో పాటు స్టిక్కర్లను ఆవిష్కరించడం జరిగిందని చైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమములో బొరిగం బాలకృష్ణ , పెద్దలు దార్ల అమృతాచారి, పెండోట రామస్వామి, దార్ల పెద్ద నర్సిహ్మాచారి, ముంజంపల్లి బ్రహ్మం ,పూజార్లు తోట శ్రీనివాస్, తోట శంకర్ , సంఘ సేవకులు వారాల రామచంద్రం యాదవ్ , కొంకా మురళి, బజారు మహేష్ తో పాటు దేవస్థాన కమిటి సభ్యులు దార్ల ప్రభాకర్ , కొంగరి వెంకటేష్ , దార్ల జంగయ్యా చారి , ఆదిమూలం మహేష్ , నల్లగిన్నెల మల్లయ్య , పెండోట వెంకటేశ్వర్లు , దార్ల మురళి ,నారోజు సాయి కుమార్ , గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కృషితో అద్భుత విజయాలు సాధించవచ్చు



**నూతనకల్,జనవరి 29 (నినాదం):** విద్యార్థుల నైపుణ్యానికి ఉపాధ్యాయుల కృషితో అద్భుత విజయాలు సాధించవచ్చని సోమ్లాతండా గ్రామానికి చెందిన ప్రస్తుత తుర్కపల్లి మండల తాసిల్దార్ దేశ్య నాయక్ అన్నారు.గురువారం నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ..విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని చదువుతోపాటు నేటి పోటీ ప్రపంచంలో బతికేందుకు స్కిల్స్ కూడా కావాలనీ,అప్పుడు ప్రపంచంతో పోటీ పడగలం.నేడు మేము ఉన్నత స్థాయికి ఎదిగామంటే ఈ పాఠశాలే మాకు మూలాధారం అన్నారు.రాబోయే రోజుల్లో పదో తరగతి విద్యార్థులు పాఠశాల మొదటి,రెండో,మూడో ర్యాంకు సాధిస్తే రూ,20,15,10 వేలు విద్యార్థులకు ఇస్తానని తెలిపారు..ఎంఈఓ ధారాసింగ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే యువత లక్ష్యం ఏర్పరచుకొని దాని సాధన కోసం కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని,నేడు ఇదే పాఠశాల నుండి లింగ్యా నాయక్ ఐఏఎస్ ఆఫీసర్ కావడం మనకెంతో గర్వకారణం అని విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. ఈనాటి కార్యక్రమంలో హెచ్ఎం గోపగాని సోమయ్య గౌడ్ఉ,పాధ్యాయుని,ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల్లో లబ్దికోసం

# కెసిఆర్ కు సిట్ నోటీసులు

- ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్
- ఎవరెస్టు శిఖరమంతా ఎత్తు ఎదిగిన కెసిఆర్ ను బలహీనపరచాలనుకోవడం రేవంత్ మూర్ఖత్వం
- మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి జనవరి 29 (నినాదం) :** మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది కోసం కేసీఆర్ కు సిట్ నోటీసులు అందజేయడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఖండించారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, శిఖరమంతా ఎత్తు ఎదిగిన కేసీఆర్ ను బలహీనపర్చాలనుకోవడం రేవంత్ రెడ్డి మూర్ఖత్వమని అన్నారు. కేసులకు భయపడేది లేదని, బరి గీసి బరాబర్ కొట్లాడుతామని నిరంజన్ రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని పాలించిన నాయకులు వై.ఎస్.ఆర్, చంద్రబాబు నాయుడు వంటి వారికంటే బలవంతులు కారని, తెలంగాణ రాష్ట్ర సాధనను చంద్రబాబు, వై.ఎస్.ఆర్ లు అణచాలని, ఆపాలని, నిరోధించాలని ఎన్ని కుట్రలు పన్నినా మనోనిబ్బరంతో ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ కు ఈ విచారణలు, కేసులు వెంట్రుకతో సమానమని అన్నారు. ప్రభుత్వం చేసే చిలిపి, చిల్లర చేష్టలతో వారి మీద ప్రజలు అసహ్యం, ఏహ్యభావం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బరిగీసి బారాబర్ కోట్లాడి బిఆర్ఎస్ జండా ఎగరవేస్తామని నిరంజన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

***-పట్టణ అభివృద్ధి నిరంజన్ రెడ్డికి ముందు నిరంజన్ రెడ్డి తర్వాత చూడాలి మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్***

పట్టణ అభివృద్ధి నిరంజన్ రెడ్డి కంటే ముందు నిరంజన్ రెడ్డి తర్వాత చూడాలని, ప్రజలు నిజం వెంట అభివృద్ధి వెంట నిలబడాలని మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ అన్నారు. వనపర్తి మున్సిపల్ ఇంచార్జ్ స్వామి గౌడ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేయబోతున్న 29మందితో కూడిన మొదటి జాబితాను విడుదల చేశారు.ఈ సందర్భంగా స్వామి గౌడ్ మాట్లాడుతూ నిజమైన ప్రజా సేవకులను, పార్టీ విధేయులను వడపోసి ప్రకటించామని, ప్రజలు మద్దతు ఇచ్చి గెలిపించి నిరంజన్ రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పాలన చేతకాక ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఫోన్ ట్యాపింగ్ డ్రామా ఆడుతున్నారని చెప్పారు. గూఢచార వ్యవస్థ ఈ నాటిది కాదని, కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసం టివి సీరియల్ నడుపుతున్నారని, కెసిఆర్ కు నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500, ఆసరా పింఛన్లు రూ.4000, తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా బరోసా, విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, గ్యాస్ సబ్సిడీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతు బీమా, సకాలంలో యూరియా అందించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. సుపరిపాలన కోసం బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

***సిపియం పార్టీకి 18, 21వార్డుల కేటాయింపు : జిల్లా బిఆర్ఎస్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్***

పట్టణ అభివృద్ధిలో మిత్రపక్షాల సహకారం అవసరమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సిపిఎం పార్టీకి స్నేహహస్తం అందించారని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తెలిపారు. పొత్తులో బాగంగా రెండు సీట్లలో 18 వ వార్డు, 21 వార్డులో పుట్ట ఆంజనేయులు, మదన్ పోటీచేస్తారని అశోక్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు బి.లక్ష్మయ్య, పలుస రమేష్ గౌడ్, గంధం బాలపీరు, గులాం ఖాదర్ ఖాన్, బొబ్బిలి ప్రేమ్ కుమార్, వెంకట్ సాగర్, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, నీలస్వామి, జానంపేట శ్రీనివాసులు, నందిమల్ల రవి తదితరులు ఉన్నారు .

## నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా పొరపాట్లు లేకుండా నిర్వహించాలి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, జనవరి 29 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం కలెక్టర్ పెబ్బేరులోని మున్సిపల్ కార్యాలయం, కొత్తకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల కేంద్రాల్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిటర్నింగ్ అధికారులు పబ్లిష్ చేసిన ఎన్నికల నోటీస్ ఫామ్1 పరిశీలించారు. అనంతరం హెల్ప్ డెస్క్ లో నామినేషన్లు వేయడానికి వచ్చేవారికి కావాల్సిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఓటర్ జాబితాను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, స్వీకరించిన నామినేషన్లను ఎప్పటికప్పుడు 'టి-పోల్' వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసే వారికి సింబల్స్ ని చూపించాలని సూచించారు.పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల, కొత్తకోట పురపాలికకు సంబంధించి కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల సామగ్రి పంపిణీ, సేకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కొరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. విశాల ప్రదేశంలో సులువుగా అర్థమయ్యేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పటిష్టమైన బారికేడ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ను స్వయంగా పరిశీలించి, భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇతర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## రెండవ రోజు కోలాహలంగా సాగిన నామినేషన్ల ప్రక్రియ



**డోర్నకల్/మరిపెడ జనవరి 29(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో రెండవ రోజు నామినేషన్ల ప్రక్రియ కోలాహలంగా సాగింది. పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా పలు వార్డులలో నామినేషన్లు దాఖలు చేశారు. మూడవరోజు మరింత నామినేషన్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు.ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఎనిమిదో వార్డ్ కాంగ్రెస్ పార్టీ, మూడవత్ కవిత రవికుమార్ ఏడో వార్డు ఇండిపెండెంట్, అజ్మీర ప్రసాద్ ఒకటో వార్డు ఇండిపెండెంట్, గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి 13వ వార్డు బి ఆర్ ఎస్ పార్టీ, బోడ రవి కాంగ్రెస్ పార్టీ ఐదో వార్డ్, గంధసిరి రమాదేవి ఉప్పలయ్య 13వ వార్డు ఇండిపెండెంట్,బోడ కవిత రమేష్ పదో వార్డు కాంగ్రెస్ పార్టీ, గంట్ల గౌతంరెడ్డి 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ, వేర్మారెడ్డి నాగేంద్ర 13 వార్డ్ కాంగ్రెస్ పార్టీ, ముత్యం రత్నం రాకేష్ గౌడ్ ఆరో వార్డు కాంగ్రెస్ పార్టీ, ఇస్లావత్ తిరుపతి ఒకటో వార్డు కాంగ్రెస్ పార్టీ,బోడ చరణ్ ఐదో వార్డ్ ఇండిపెండెంట్,జాటోత్ బాలాజీ బీఆర్ఎస్ 15వ వార్డు, బోడ అరుణ సీతారాం ఆరో వార్డ్ బ్లూ ఇండియా పార్టీ,బానోత్ భద్రమ్మ శ్రీను రెండో వార్డ్ బిఆర్ఎస్ పార్టీ, లూనావత్ హుస్సేన్ నాయక్ ఒకటో వార్డు బిజెపి పార్టీ, గంధసిరి బిక్షపతి 12 వ వార్డు కాంగ్రెస్ పార్టీ,లునావత్ రవి బిఆర్ఎస్ పార్టీ ఒకటో వార్డు, జాటోత్ నరేష్ బిఆర్ఎస్ పార్టీ ఒకటో వార్డు, లావుడియా సత్యవతి బిఆర్ ఎస్ పార్టీ 11వ వార్డు,బానోత్ శిరీష నరేష్ 8వ వార్డు బీఆర్ఎస్ పార్టీ, బానోత్ అనిత రెండో వార్డు కాంగ్రెస్ పార్టీ,రవి బిఆర్ఎస్ పార్టీ నాలుగో వార్డ్,బల్లెం సురేష్ 4 వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ, పాకాల రఘురాం శర్మ 12 వ వార్డ్ బీజేపీ పార్టీ,దేవేంద్ర నాలుగో వార్డ్ కాంగ్రెస్ పార్టీ, బానోత్ పార్వతి పదో వార్డ్ కాంగ్రెస్ పార్టీ, భూక్యా నరేష్ 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ, లునావత్ సోమన్న 15వ వార్డు బిఆర్ఎస్ పార్టీ నామినేషన్ ప్రక్రియలో భాగంగా మూడవరోజు మరింత ఆశావహులు నామీనేషన్ వేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

### : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ జనవరి 2(నినాదం):** గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్ లు అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం లావుడితండా గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ సమక్షంలో గురువారం సర్పంచ్ లావుడి శ్రీహరి, ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ ప్రారంభించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కోసం పాటు పడ్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి బి.వాణి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



### వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి

## బోర్ పక్కన వేసిన బోరును సీజ్ చేయాలి

### - రైతు దేవిరెడ్డి శంకర్ రెడ్డి



**మిర్యాలగూడ జనవరి 29(నినాదం):** వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి బోర్ పక్కన వేసిన బోరు ను సీజ్ చేయాలని మండల కేంద్ర మైన మాడ్గులపల్లి గ్రామానికి చెందిన రైతు దేవిరెడ్డి శంకర్ రెడ్డి ఆవేదనవ్యక్తంచేశారు.గురువారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాడ్గులపల్లి రెవిన్యూ శివారు సర్వేనెంబర్ 220 లో ఉన్నటువంటి పదిహేను ఎకరాలలో వ్యవసాయం సాగించుటకు గత 20 ఏళ్ల క్రితం మా నాన్న పోరు వేయాగ అదే బోర్ తో వ్యవసాయాన్ని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు.మాకుతెలియకుండా అక్రమంగా మా బోరుకు 10 ఫీట్ల దూరంలో మరో వ్యక్తి వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా బోర్ వేశారన్నారు. దీంతో పక్కనే ఉన్న మా బోరు నిలిచిపోవడంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లి సాగుచేసిన వరి పంట నీరు అందక నిండిపోయే పరిస్థితి నెలకొంది అన్నారు. ఈ విషయమై బోరును సీజ్ చేయాలని స్థానిక తహశీల్దార్ కువినతిపత్రంఇవ్వడంజరిగిందన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోరు వేసుకుంటే తనకేం అభ్యంతరం లేదని, అక్రమంగా నా బోర్ దగ్గర బోర్ వేయడంతో నా బోరు అడుగంటి పోయిందన్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి తాను చేసిన ఫిర్యాదు మేరకు నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును సీజ్ చేయాలని రైతు శంకర్ రెడ్డి కోరారు.

## బొలెరో లారీ ఢీ : ఐదుగురికి తీవ్ర గాయాలు




**మహాదేవపూర్ జనవరి 29, (నినాదం):** బొలెరో లారీ ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర గడిచిరోలి జిల్లా అహేరి తాలూకా చల్వాడకు చెందిన వ్యక్తులు మేడారం సమ్మక్క సారక్క దర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మహాదేవపూర్ మండల కేంద్రంలోని కాళేశ్వరం రహదారిలో నర్సరీ మూలమలుపు ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ నుండి చెన్నై వెళ్తున్న లారీ మహారాష్ట్రకు చెందిన MH 33A 3955 బొలెరో వాహనానికి ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన మీనబాయి కొటంగే, వైకుంఠం కోటంగే, రాజ్ కుమార్ కోటంగే, మరియు గౌరీబాయి నేకోడే, బొలెరో డ్రైవర్ వసంత్ చవాన్ లు తీవ్రంగా గాయపడటంతో మహాదేవపూర్ సామాజిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రికి తరలించారు. కాగా బొలెరో వాహనంలో 9 మంది ప్రయాణిస్తుండగా ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే విషయం తెలుసుకున్న స్థానిక సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్ లు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ తరపున షేక్ జహంగీర్ నామినేషన్



**వనపర్తి ప్రతినిధి, జనవరి 29 (నినాదం)** వనపర్తి పట్టణంలోని 31 వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా షేక్ జహంగిర్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. వనపర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను గురువారం ప్రకటించారు. ఆ జాబితాలో బీఆర్ఎస్ నాయకులు షేక్ జహంగీర్ పేరు ఉండడంతో ఆయన 31 వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాన్ని అధికారులకు అందజేశారు. గత ఐదేళ్లుగా వార్డులో అనేక సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. ఆయన బీఆర్ఎస్ హయాంలో వక్ఫ్ ఆస్తుల రక్షణ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా కూడా పని చేశారు.

## నేడు వనపర్తికి ఎమ్మెల్సీ ఏవీయన్ రెడ్డి రాక



**వనపర్తి ప్రతినిధి, జనవరి 29 (నినాదం) :** మున్సిపల్ నామినేషన్లకు శుక్రవారం చివరి రోజు కావడంతో బిజెపి అభ్యర్థుల తరపున నామినేషన్లకు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు ఏవీఎన్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. వనపర్తి మున్సిపాలిటీలోని 33 వార్డుల నుండి పోటీ చేసే అభ్యర్థులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉదయం 11 గంటల వరకు పాలిటెక్నిక్ కళాశాల దగ్గరికి చేరుకోవాలని ఆయన కోరారు

## పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఖర్చు వివరాలు ఇవ్వాలి

***- ఎన్నికల ఖర్చు వివరాలు ఇచ్చి తీరాల్సిందే***

***- ముగిసిన 45రోజుల గడువు తేదీ - సమర్పించకపోతే పోటీకి అనర్హులే***

**కమలాపూర్ 29 జనవరి (నినాదం):** గత సంవత్సరం డిసెంబర్ నెలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు లకు పోటీచేసిన అభ్యర్థులు గెలిచిన వారు, ఓడిపోయిన అభ్యర్థులు సైతం ఎన్నికల ఖర్చు వివరాలను ప్రభుత్వ అధికారులకు అందించాలి. ఎన్నికల సంఘము నియమావళి ప్రకారం ఎన్నికల కోడ్ ముగిసిన నాటినుండి 45 రోజులలో వారు ఖర్చు చేసిన లెక్కలు సమర్పించాలి.ఒకవేళ లెక్కలు సమర్పించని వారు రాబోయే ఎన్నికల్లో పోటీచేయడానికి అనర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన ఎన్నికల ఖర్చును ఎన్నికల సంఘము నియమాల ప్రకారం 5వేల కంటే ఎక్కువజనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ 2 లక్షల 50 వేలు,వార్డు సభ్యులుగా పోటీచేసిన అభ్యర్థులు రూ 50 వేలవరకు ఖర్చు చేయాలి. అదేవిధంగా 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ 1ఒక లక్ష 50 వేలు, వార్డు సబ్యులుగా పోటీచేసిన అభ్యర్థులు రూ 30 వేలు ఖర్చు చేయడానికి ఎన్నికల నియమావళి తెలియ చేస్తుంది.పోటీచేసిన అభ్యర్థులు నామినేషన్ సమర్పించిన రోజు నుండి పోలింగ్ జరిగే రోజు వరకు ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేసిన వివరాలు బ్యాంక్ అకౌంట్ స్టేట్ మెంట్ తో సహా సరైన బిల్లులను జత పరుస్తూ ఎన్నికల సంఘానికి సమర్పించాలి. వాటిని ఎన్నికల సంఘము నియమించిన ఆడిట్ అధికారులు లెక్కలను సరి చూస్తారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోటీచేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందించడానికి గురువారం తో ముగిసింది. అయితే కమలాపూర్ మండలంలో 24 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా 110 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో నిలిచారు. వారిలో గురువారం వరకు 87 మంది అభ్యర్థులు లెక్కలు సమర్పించగా,23 మంది అభ్యర్థులు లెక్కలు సమర్పించలేదు, అలాగే 599 మంది వార్డు అభ్యర్థులు బరిలో నిలువగా గడువు ముగిసే సమయానికి 435 మంది అభ్యర్థులు లెక్కలు సమర్పించాగా 164 మంది అభ్యర్థులు ఇంకా లెక్కలు సమర్పించలేదని మండల ఎన్నికల అధికారులు తెలిపారు. అదేవిదంగా ఎన్నికల ఖర్చులు సమర్పించిన వారి లెక్కలు ఆడిట్ అధికారులు లెక్కలను సరిచూస్తున్నారు. ఎన్నికల సంఘము నియమాలను పాటించని అభ్యర్థుల విషయంలో ఎన్నికల సంఘము తీసుకునే చర్యలకు బాధ్యత వహించి వలసి ఉంటుందని అధికారులు ఎచ్చరిస్తున్నారు.

## మద్యం ప్రియులకు తీపి కబురు...

### పున:ప్రారంభమైన హనీ7 బార్ అండ్ రెస్టారెంట్



**డోర్నకల్/మరిపెడ జనవరి 29(నినాదం)** మద్యం ప్రియులకు తీపి కబురు అందింది. మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని హనీ7 బార్ అండ్ రెస్టారెంట్ పున: ప్రారంభమైనది.గురువారం మరిపెడ మండలంలోని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు,వ్యాపారస్తులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.హనీ7 బార్ అండ్ రెస్టారెంట్ ప్రొప్రైటర్ దుబ్బాక నరేష్ రెడ్డి, దుబ్బాక లక్ష్మారెడ్డి వచ్చిన అతిధులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. రుచికరమైన చికెన్,మటన్,ఫ్రాన్స్,బిర్యానీలతో అందరికీ నచ్చే విధంగా ఆహారాన్ని అందజేస్తున్నమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ నవీన్ రావు,బీఆర్ఎస్ నాయకులు మహేందర్ రెడ్డి,గుగులోత్ రాంబాబు నాయక్, తేజవత్ రవీందర్ నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంధసిరి అంబరీష, పాంగోత్ రాంలాల్ నాయక్, వివిధ వ్యాపారస్తులు ఇంకా తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞానమనే ఓ ఖని...

# వెలికి తీయడం పత్రికల పని

**ఘనంగా నినాదం క్యాలెండర్ ఆవిష్కరణ**

**జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదయ్య**

**జవహర్ నగర్, జనవరి 29( నినాదం):** విజ్ఞానం అనే ఖని వెలికి తీయడం వార్తాపత్రికల పని అని జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదయ్య పేర్కొన్నారు. నిజాయితీకి నిలువుటద్దం నినాదం దినపత్రిక అని నికార్సైన వార్తలతో నినాదం దినపత్రిక ప్రముఖంగా వెలుగొందుతుందని జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపారు. నినాదం దినపత్రిక క్యాలండర్ ను జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలో కీలకమైన ఫోర్త్ ఎస్టేట్ ప్రస్తుత తరుణంలో కీలకంగా పనిచేస్తుందని ఎండనకా వాననకా అర్ధరాత్రి అయినా మిట్ట మధ్యాహ్నం అయినా తాను తిన్న తినకున్నా ప్రభుత్వ సమాచారాన్ని అయినా ప్రజా సమస్య అయినా ప్రతిపక్ష పార్టీల వాణి అయిన ప్రెస్మీట్ అయినా స్పాట్ న్యూస్ లు అయినా తీవ్ర ఎండలోనైనా జోరు వాన లో అయినా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ గడియారంతో పోటీపడుతూ ప్రజలకు సమగ్ర సమాచారాన్ని చేరవేసే నిజమైన వారధులు, జర్నలిస్టులు, పత్రికలు అని అటువంటి పత్రికలలో పేరు పొందిన పత్రిక నినాదం దినపత్రిక అని తెలిపారు. నినాదం దినపత్రిక ప్రజా గొంతుకగా ప్రజా సమస్యలను వెలికి తీసి అధికారులకు చేరవేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించే ఒక ప్రముఖమైన పత్రికగా కొనియాడారు. సమాజంలోని సమస్యలను వెలికి తీయడంలో నినాదం పత్రిక ప్రజల గొంతుకగా వినిపిస్తుందని అన్నారు. ప్రస్తుత తరుణంలో పత్రికల పాత్ర కీలకమని ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజ చైతన్యానికి ప్రజా సంక్షేమానికి అత్యంత కీలక పాత్రను పోషిస్తాయన్నారు. నిత్యం తాజా వార్తలు విశ్లేషణలు అందించడంతోపాటు అవినీతిని ఎండ కట్టడం ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ప్రజలకు వాస్తవాలను ఖచ్చితమైన సమాచారంతో ఖచ్చితమైన సమయంలో తెలుపుతున్న పత్రిక ఒక్క నినాదం పత్రికకే చెల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ రాము, ఎస్సై వేణుమాధవ్, పోలీసులు , పాత్రికేయులు కొలిపాక లక్ష్మణ్, ఆకుల నరసింహ, తూటి శ్రీనివాసులు, పందిరి శ్రీనివాసులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

విధానమైన శైలికి.. సమగ్రమైన కథనాలకు

# నిలువుటద్దం నినాదం

**కాప్రా ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్**



**జవహర్ నగర్, జనవరి 29 (నినాదం):** విధానమైన శైలికి సమగ్రమైన కథనాలకు నిలువుటద్దంగా నినాదం దినపత్రిక నిలుస్తుందని కాప్రా ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ పేర్కొన్నారు. జనమోదమైన వార్తలకు నిలువుటద్దంగా నిలుస్తున్న నినాదం దినపత్రిక క్యాలండర్ ను గురువారం కాప్రా తహసీల్ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ మాట్లాడుతూ. ఉదయం తలుపులు తెరవగానే వార్తాపత్రికలు శుభోదయం అంటూ పలకరిస్తాయి. మన దేశంలో తొలిసారి జేమ్స్ ఆగస్టు ఎక్కి నాయకత్వంలో "బెంగాల్ గెజిట్ గెజిట్" అనే వారపత్రిక కలకత్తా నుండి 1780 జనవరి 29న వెలబడిందని దీనితో ఇండియన్ న్యూస్ పేపర్ డే (భారతీయ వార్తాపత్రిక దినోత్సవం) ప్రతి సంవత్సరం జనవరి 29న జరుపుకుంటారని ఈ నినాదం దినపత్రిక కేలండర్ ను జాతీయ వార్తాపత్రిక దినోత్సవం రోజున ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో ప్రింట్ జర్నలిజం పుట్టుకను పరిణామ క్రమాన్ని గౌరవించ డానికి ఈ రోజునే జాతీయ వార్తాపత్రిక దినోత్సవం జరుపుకుంటారని, ప్రజాస్వామ్యం విలువలు పరిరక్షణ ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబు దారితరం పెంచడం ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య అనుసంధాన కర్తలుగా నిలవడం భావ ప్రకటన స్వేచ్ఛలను కాపాడడం అవినీతి అక్రమాల జరగకుండా వాచ్ డాగ్ లాగా నినాదం పత్రిక పనిచేయడం అభినందనీయమన్నారు. పేదల పక్షపాతిగా నిలవడం సమయానుకూలంగా ప్రపంచ, జాతీయ, రాష్ట్రీయ ప్రాంతీయ వార్తలను మన ఇంటికి కంటికి మనసు లోతులేకి చేర్చడం ప్రజలను బలోపితం చేయడం ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించడం ప్రజలను చైతన్యవంతం చేయడం" నినాదం పత్రిక యొక్క ముఖ్య కర్తవ్యమని" తద్వారా జీవితంలో ఓ ప్రధాన భాగమైన మన జీవితాలలో అవి బాహ్యమైన అనుబంధాలు కలిగి ఉన్నాయని తెలిపారు. వార్తా పత్రికలు రానున్న రోజుల్లో మనుగడ సాధ్యం కావడానికి నిక్కచ్చి వార్తలను అందించడం నాణ్యమైన సమాచారం చేరవేయడం డిజిటల్ ఇంటిగ్రేషన్ సాధించడం ప్రతిభావంతులైన నిజాయితీపరులు మాత్రమే విలేకరులుగా సేవలు అందించడం పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పత్రికల్లో సమయానుకూలంగా మార్పులు చేయడం ప్రభుత్వాలు తమ ప్రకటనతో ప్రోత్సహించడం మెరుగైన ఖచ్చితమైన సమాచారాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవడం తదితరాలతో పత్రికలు గొప్పగా వెలుగొందితాయని ,నినాదం పత్రిక భవిష్యత్తులో జనామోదమైన కథనాలతో ప్రధాన పత్రికల తో పాటుగా పోటీగా నిలబడి ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుందని తెలిపారు. నికార్సైన జర్నలిజానికి చిరునామాగా నినాదం పత్రిక నిలుస్తుందనితెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్టులు కొలిపాక లక్ష్మణ్, మైసయ్య, పందిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

---

# మెట్పల్లి మున్సిపాలిటీలో నామినేషన్ల పరిశీలన

**అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్**



**మెట్పల్లి జనవరి 29(నినాదం):-** మెట్పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ & మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీ బి. రాజా గౌడ్ గురువారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు.నామినేషన్ల స్వీకరణ రెండవ రోజు కావడంతో ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని తెలిపారు. చివరి రోజు నామినేషన్లకు ఎక్కువగా తాకిడి ఉండే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే చేసినట్లు చెప్పారు. చివరి రోజు నామినేషన్ల స్వీకరణ సమయంలో ఐదు గంటల లోపు నామినేషన్ సెంటర్లోకి ప్రవేశించిన అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మోహన్, డీఈ నాగేశ్వరరావు, టీపీఓ రాజేంద్రప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

అధిక దిగుబడితోపాటు లాభసాటి పంటలను పండించే విధంగా

# రైతులకు అవగాహన కల్పించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి**







**వికారాబాద్, జనవరి 29(నినాదం):** రైతులు పండించే పంటల అధిక దిగుబడి తో పాటు లాభసాటివిగా ఉండే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో అధిక సాంద్రత పంటల సాగు, నానో యూరియా, డిఎపి వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ రైతులకు అధిక లాభాలు వచ్చే విధంగా పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలుకువలను రైతులకు తెలియజేయాలన్నారు. సన్న రకం వరిని సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని, అదేవిధంగా సన్న రకం పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయలు ప్రభుత్వం అందజేస్తున్న విషయాన్ని తెలియజేస్తూ వారిలో అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఎలాంటి వరిని పండిస్తే అధిక లాభాలు వస్తాయో అనే విషయాన్ని కూడా రైతులకు సూచించాలని ఆమె తెలిపారు. రైతులు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా పంటలు సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రజ్ఞులు రూపొందించిన వివిధ రకాల పంటలు సాగు చేసే విధంగా శాఖ పరంగా దృష్టి సారిస్తామన్నారు. రైతులకు వివిధ కంపెనీల వల్ల నాణ్యమైన విత్తనాలను అందించకపోవడం వల్ల రైతులు మోసపోతున్నారని, రైతులకు ముందస్తుగానే అన్యాయం జరగకుండా సూచనలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల దిగుబడి తక్కువగా వస్తుందని, రైతులందరూ సమయానుకూలంగా నాట్లు వేసే విధంగా రైతులకు సూచించాలన్నారు. సన్న రకాల వరిని పండించడంతోపాటు అధిక దిగుబడి వచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులు ఆయన సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేశ్వర్ రెడ్డి, రాజా మధు శేఖర్, ఏడీఏలు సందీప్, శంకర్ రాథోడ్, లక్ష్మీ కుమారి, వెంకటేశం, కొమరయ్య, మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

---

NINADAM CINEMA

# అమ్మా నీ ఆశీర్వాదమే నా బలం

**తల్లి అంజనాదేవి పుట్టినరోజు చిరు పోస్ట్**



పదవులు, ఖ్యాతి, పేరు ఎంత ఉన్నా.. తల్లి ముందు మాత్రం ప్రతి కొడుకు చిన్నవాడే. అదే విషయాన్ని మరోసారి నిరూపించారు మెగాస్టార్ చిరంజీవి. కోట్లాది మంది అభిమానులకు ఆయన లెజెండ్ అయినా, తన తల్లి అంజనా దేవి ముందు మాత్రం ఒక సాధారణ కుమారుడిగా మారిపోతారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు అభిమానులను హత్తుకుంటోంది. జనవరి 29 అంజనా దేవి పుట్టినరోజు కావడంతో, చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'అమ్మా.. నీ ఆశీర్వాదమే నా బలం. పుట్టినరోజు శుభాకాంక్షలు' అంటూ ఎక్స లో ఓ ఎమోషనల్ మెసేజ్‌ను పంచుకున్నారు. ఈ సందేశంతో పాటు ఒక ప్రత్యేక వీడియోను కూడా అభిమానులతో షేర్ చేశారు. ఆ వీడియోలో మెగా కుటుంబ సభ్యులందరితో కలిసి అంజనా దేవి గడిపిన అరుదైన క్షణాలు, కుటుంబ వేడుకల ఫోటోలు, మధురమైన జ్ఞాపకాలు కనిపిస్తున్నాయి. ఈ విజువల్స్ అభిమానులను మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకులను కూడా భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. వీడియో విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ అంజనమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చిరంజీవి తన తల్లిపై ఉన్న ప్రేమను ఎప్పుడూ దాచుకోరు. ప్రతి ఏడాది ఆమె పుట్టినరోజు, మదర్స్ డే వంటి సందర్భాల్లో తప్పకుండా ఆమెను గుర్తు చేసుకుంటారు. షూటింగ్‌లు, రాజకీయ కార్యక్రమాలు, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా.. తల్లితో సమయం గడపడానికి చిరు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ విలువలు, క్రమశిక్షణ, ఓర్పు, సహనం వంటి గుణాలు తన తల్లి నుంచే నేర్చుకున్నానని చిరంజీవి పలు సందర్భాల్లో వెల్లడించారు. మెగా కుటుంబానికి అంజనా దేవి ఒక అండగా, ధైర్యంగా ఉంటారని చిరు ఎప్పుడూ చెబుతుంటారు. గత ఏడాది కూడా ఆమె పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు.

---

# యుఫోరియాతో విజయం సాధిస్తా

**గుణశేఖర్**



కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నత స్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు.

---



ఒప్పుకోకుంటే

# లేచి పోదామనుకున్నాం

**పెళ్లి వార్తలపై షాకింగ్ విషయాలు చెప్పిన కీర్తి సురేశ్**

'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్‌చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచి పోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది.పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒకకల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.

---

వరుసగా సినిమాలతో

# ప్రభాస్ బిజీ



వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంత కాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాల్నైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787